J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS






# లాయర్

సంపుటి : 42 సంచిక : 21 28.10.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## భగవద్గీత సాక్షిగా.. ఫలించిన కృషి

# బ్రిటన్ పీఠంపై భారత 'రిషి'

బ్రిటన్ ప్రధానిగా భారతీయ సంతతికి చెందిన రిషి సునాక్ పదవిని అధిష్టించడం చరిత్రాత్మకం. ఒకనాటి గ్రేట్ బ్రిటన్ ఇప్పుడు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయింది. ఈ స్థితిలో దేశాన్ని గట్టెక్కించడానికి భారతీయ మూలాలున్న రిషి ప్రధానిగా పదవిని స్వీకరించడం.. ఒక అద్భుతం. తాను హిందువునంటూ గొప్పగా చెప్పుకుంటూ భారతీయ సంప్రదాయాలను అనుసరించే రిషి, బ్రిటన్‌కు ప్రధాని కావడం భారతీయులందరికీ గర్వకారణం.

10లో

# కరెంటు కష్టాలను గట్టెక్కిస్తాం

### నెల్లూరు జిల్లా పర్యటనలో వరాలు కురిపించిన సిఎం జగన్



3లో



# షార్ విజయం

(వార్త 7వ పేజీలో)



కీ॥శే॥ శ్రీమతి వేమిరెడ్డి శ్యామలమ్మ గారు

నిర్యాణం: 01-11-2013

## 9వ వర్ధంతి



అనురాగమూర్తి... ఆత్మీయదీప్తి...

# అమ్మ

ఆమె ప్రేమానురాగాలే మాకు స్ఫూర్తి
ఆమె నడిపించిన బాటే మాకు కీర్తి

కుమారుడు

**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

రాజ్యసభ సభ్యులు

# మాలకొండస్వామికి.. కలెక్టర్ పూజలు



కందుకూరు నియోజకవర్గంలోని వలేటివారిపాలెంలో వెలసి వున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని ఇటీవల జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు సందర్శించి పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ కెవి శ్రీనివాసరావు స్వాగతం పలికి దైవదర్శనం చేయించారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ మాధవన్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక ఉన్నారు.

# సమాజానికి చైతన్యం కలిగించేదే సాహిత్యం

## 'గీతా మకరందము' ఆవిష్కరణోత్సవంలో వక్తలు



సాహిత్యం సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని, మానసిక వికాసానికి, విజ్ఞానానికి దోహదం చేసే సారస్వతాన్ని అందరూ ప్రోత్సహించాలని వక్తలు అన్నారు. నెల్లూరుజిల్లా తోటపల్లిగూడూరు మండలం తోటపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ కవి కోట శ్రీరామమూర్తి రచించిన 'గీతా మకరందము', 'విజ్ఞానదీపిక' పుస్తకాల ఆవిష్కరణ ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా జరిగింది. ఉజ్వల సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంధ సేవా సంస్థ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ సాహిత్యం సమాజానికి చైతన్యం కలిగించి, మంచిబాటలో నడిపిస్తుందన్నారు. 'రసమయి' అధినేత డా.ఎంకె రాముతో కలసి ఆ పుస్తకాలను వారు ఆవిష్కరించారు. కోట శ్రీరామమూర్తి ఆధ్యాత్మిక రచనలు స్ఫూర్తిదాయకమన్నారు. 'నేటి నిజం' పత్రిక సంపాదకులు బైసా దేవదాసు అధ్యక్షతన జరిగిన ఈ పుస్తకావిష్కరణల్లో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్, డాక్టర్ శ్రీధర్, సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, ఆధ్యాత్మికవేత్త తంగిరాల నరేష్, డా.కావూరి శ్రీనివాస్, ప్రముఖ రచయితలు డా.రాధశ్రీ, చిక్కా రామదాసు, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కె.రాధిక, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ

పేదలందరికి ఇళ్ళను అందించేందుకు డిసెంబర్‌కల్లా రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ హరిత సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె గృహనిర్మాణాల అధికారులతో సమావేశమై, ఇళ్ళు మంజూరైనవారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలన్నారు.

# వవ్వేరు బ్యాంకు..లెక్కలు తీస్తున్నారు

బుచ్చిరెడ్డిపాలెంలోని వవ్వేరు బ్యాంకులో బంగారు రుణాలకు సంబంధించి అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో అధికారులు లెక్కలన్నీ బయటకు తీస్తున్నారు. జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు అధికారులు, వవ్వేరు బ్యాంకుకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని ప్రతి పద్దును పరిశీలిస్తున్నారు. రెండుమూడు రోజుల్లోనే ఆడిట్ పూర్తవుతుందని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆడిట్ చేస్తున్న అధికారులు తెలిపారు.

# అంకాళమ్మ తల్లికి.. పొంగళ్ళు

మండల కేంద్రమైన మర్రిపాడులో గ్రామదేవత అంకాళమ్మ గుడికి ఇటీవల భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. గ్రామ ప్రజలంతా పాడిపంటలతో, సుఖసంతోషాలతో జీవించేలా దీవించాలంటూ ప్రార్థించారు. మహిళలు పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. ఆలయ ధర్మకర్త ఎం.వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పర్యవేక్షించారు.

## ఏఎస్‌పేటలో

# ఉచిత వైద్యశిబిరం

అనుమసముద్రంపేట (ఏఎస్‌పేట)లో ఇటీవల ఉరుసు, గంధమహోత్సవం సందర్భంగా ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ సురేష్, డాక్టర్ మంజులమ్మ ఆధ్వర్యంలో దర్గా ఆవరణంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేసి భక్తులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. మూడురోజుల పాటు జరిగిన ఈ శిబిరంలో అనేకమంది భక్తులు పరీక్షలు చేయించుకున్నారు.

## బుచ్చిలో

# 'నాడు-నేడు' సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని శాంతినగర్‌లో 'నాడు-నేడు' పనులు ఎలా జరుగుతున్నాయో ఐటిడిఏ అధికారిణి శాంతకుమారి పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు బివి ప్రసాదరావు, ఉపాధ్యాయులతో సమావేశం పెట్టి, ఆ పనుల పురోగతిపై సమీక్షించారు. కార్పొరేట్ స్కూళ్ళకు ధీటుగా పనులు చేపట్టాలని, పనులు నాణ్యతగా పూర్తిచేయాలని ఆమె సూచించారు.

# ఇంటింటికీ జామచెట్లు

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలని కోరుతూ ముత్తుకూరులోని జనసేన నాయకుడు సురేష్‌బాబు తదితరులు పంటపాళెం పంచాయతీలోని ఊటల బలిజపాళెంలో 'జనసేన' ఆధ్వర్యంలో ఇటీవల ఇంటింటికీ జామ మొక్కలు పంపిణీ చేశారు. కాలుష్యం నివారణకు అందరూ చెట్లను పెంచాలని గ్రామస్తులను కోరారు.

# నేతన్నల సమస్యలు తీర్చండి మహాప్రభో!

## ○ చేనేత నాయకుల మొర

ఎంతోకాలంగా నేతకారులు అవస్థల్లో ఉన్నారని, వారి కష్టాలు తీర్చి ఆదుకోవాలని చేనేతనాయకులు జిల్లా ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. జిల్లా చేనేత ఐక్యవేదిక నాయకులు ఇటీవల నెల్లూరులోని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌ను కలసి తమ గోడు వినిపించారు. ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బుధవారపు బాలాజీ ఆధ్వర్యంలో చేనేత నాయకులు నెల్లూరులో ఇటీవల జాయింట్ కలెక్టర్‌ను కలసి, నేతన్నల సమస్యలను విన్నవించారు. గతంలో 'నివర్' తుఫాన్ బాధితులైన నేతకారులకు ఇస్తామన్న ఆర్థికసాయం నేటికీ అందలేదని వారు ఈ సందర్భంగా జేసీ దృష్టికి తీసుకువచ్చారు. బాగా నష్టపోయిన 10 మంది నేతకారులకు 10వేల రూపాయలు, నూలు తడిసిపోయి ఇబ్బందుల పాలైన 70 మందికి 5 వేల రూపాయల వంతున ఇవ్వాలని జిల్లా అధికారులు అప్పట్లో నిర్ణయించారని, అయితే ఇంతవరకు బాధితులకు ఆ నష్టపరిహారం అందనే లేదన్నారు. అదేవిధంగా, ప్రభుత్వం 'నేతన్న నేస్తం' పథకం కింద నేతకారులకు అందిస్తున్న సాయాన్ని చేనేత అనుబంధ వృత్తుల్లో జీవనం గడుపుతున్నవారికి కూడా వర్తింపజేయాలని కోరారు. నేతకారులకు ముద్రా రుణాలు ఇవ్వాలని, చేనేత సహకార సంఘాలను మళ్ళీ ప్రారంభించాలని, నేతకారులకు గుర్తింపుకార్డులు అందజేయాలని, చేనేత వస్త్రాలను విక్రయించుకునేందుకు ఎంతో అవసరమైన ఆప్కో షాపులను పెట్టించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కో-కన్వీనర్ ఆశం సునీల్, జాతీయ చేనేత ఐక్యవేదిక కేంద్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ సుబ్రహ్మణ్యం, రామనాథం, రాజశేఖర్, వేణుగోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం డబ్బులు ఇంకా ఇవ్వలేదు



గత వ్యవసాయ సీజన్‌లో ప్రభుత్వానికి ధాన్యం విక్రయించిన రైతులకు, ఇంతవరకు అనేకమందికి డబ్బు చెల్లించలేదని, హమాలీలకు ఇవ్వాల్సిన కూలిడబ్బులు కూడా ఇవ్వలేదని, ఇకనైనా ఆ డబ్బును అందజేసి వారి బాధలు తీర్చాలని నమామి గంగే రాష్ట్ర ప్రముఖ్, బిజెపి నాయకుడు మిడతల రమేష్ ఇటీవల జిల్లా జేసీకి వినతిపత్రం అందజేశారు.

# రోడ్ల బాగును పట్టించుకోరేం?..

నెల్లూరు నగరంలో రోడ్లు పరమ అధ్వాన్నంగా ఉన్నా జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసలే నెల్లూరు రోడ్లు అంతంతమాత్రమేనని, దానికి తోడు వర్షాలతో ఆ రోడ్లు ఇంకా దెబ్బతిన్నాయని, ముఖ్యంగా పాత చెక్‌పోస్టు దగ్గర నుంచి మైపాడు రోడ్డు దాకా రోడ్డు పూర్తిగా నాశనమైందని పేర్కొన్నారు. అధికారులు ఇకనైనా రోడ్ల బాగుపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు.

# డిఆర్‌డిఏ సిబ్బంది ఆదర్శం



తమ శాఖలో పనిచేస్తున్న ఓ చిరుద్యోగి మరణించగా, ఆ కుటుంబానికి తమవంతు సాయంగా మానవీయ హృదయంతో ఒకరోజు వేతనం అందజేసి ఆదర్శంగా నిలిచారు డిఆర్‌డిఏ(జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ) సిబ్బంది. తడ మండలంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ మృతిచెందిన పరమయ్య కుటుంబసభ్యులకు అండగా 3 లక్షల 20 వేల రూపాయలను చెక్కురూపంలో సాయంగా అందించారు. నెల్లూరులోని డిఆర్‌డిఏ కార్యాలయంలో ఇటీవల ఆ మొత్తాన్ని డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి చేతులమీదుగా పరమయ్య భార్యకు అందజేశారు. వారు చేసిన సాయానికి ఆ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

# సంగంలో పోలీస్ సర్కిల్ కార్యాలయం



మండల కేంద్రమైన సంగంలో కొత్తగా ఇటీవల పోలీస్ సర్కిల్ కార్యాలయం ప్రారంభమైంది. ఆత్మకూరు డిఎస్పీ వెంకటేశ్వరరావు ఈ కార్యాలయానికి ప్రారంభోత్సవం చేయగా, సంగం సర్కిల్‌కు తొలి సిఐగా రవినాయక్ పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సంగం ఎస్ఐ నాగార్జునరెడ్డితో పాటు చేజర్ల, ఏఎస్‌పేట ఎస్ఐలు పాల్గొన్నారు.

# మంజూషమా జోహార్

గతాన్ని జ్ఞాపకాల పొదరింట బొమ్మ కట్టి
జనం కోసం అపురూప ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు
జీవితాన్ని కమ్మని కలగా కంటూ తుళ్ళుతూ
ఆట బొమ్మల్లా -
బాల్యాన్ని కోడూబిళ్ళా ఆడుకుంటున్నట్లు
జీవిత చరమాంకాన దేవతారూపం దాల్చినట్లు
నిశ్శబ్ద కాసారంలో వెలుగుతూ వెలుగుతూ
కొడిగట్టిన వత్తి
వత్తి ప్రక్కనే పొత్తిగిల్లిన ఓ మంజూషం
తన శీతల సమీర వాయు పవనంతో
కుళ్ళుపై పోరాడుతున్న మహోన్నత బ్రహ్మ పదార్థం
మనిషి ఆఖరి అంకాన్ని తనలో ఇముడ్చుకొనే
అపురూప ధాతువు
మనిషిలో జీవుడు నిష్క్రమించాక
పార్థివ శరీర నిష్క్రమణ వేళ
ఆఖరి మజిలీ కోసం ఏర్పరచిన శయన మందిరం
రాజ్యాలేలిన రాజులైనా ఆఖరి ప్రస్థానం అక్కడే
విశ్వాన్ని ఉర్రూతలూగించిన నటవిరాట్టులైనా
ఆఖరి విడిది అదేకదా!
అపురూప జీవన దేహానికి స్వాంతన పలికే
ఓదార్పు సూచిక ధవళకాంతులీను మంజూషమే!
కడపటి భాగ్యోదయస్పర్శను అందించే
ఆఖరి మజిలీ అక్కడే
అక్కున జేర్చుకొని ఆదరించే శీతల కోవెల అదే
తన చల్లని చేతో పొదవి పట్టుకొని ఓదార్చి
ఆఖరి ఘడియల్లో సుఖవంతం చేయగల్గే
అమృత వాటిక అదే
బంగారు స్పూనుతో జన్మించినా ఆఖరు
ఘటనల శుశ్రూషలమహాతల్లి అదే
ఆవేదనపరుల గుండెల్లో జ్ఞాపకాల
బిజాల్ని చిరస్మరణీయం చేసి
చితిని పేర్చే సమశీతల మంజూషానికి
నిలువెత్తు జోహార్లు



- చిన్ని నారాయణరావు
94402 02942

## జాతీయ కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీలో సుబ్బరామయ్య



జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున్ ఖర్గే 47 మంది సభ్యులతో కూడిన పార్టీ స్టీరింగ్ కమిటీని అక్టోబర్ 26, బుధవారం నాడు ప్రకటించారు. ఈ కమిటీలో తెలుగువారి ప్రతినిధిగా రెండు తెలుగురాష్ట్రాల నుండి ఒక్క తిక్కవరపు సుబ్బరామిరెడ్డికే చోటు దక్కింది. ఢిల్లీ స్థాయిలో సుబ్బరామయ్యకు అపార పలుకుబడి ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే అఖిల భారత కాంగ్రెస్ కమిటీ శాశ్వత ఆహ్వానితుడిగా సుబ్బరామిరెడ్డి ఉన్నారు. మాజీమంత్రిగా, మాజీ రాజ్యసభ సభ్యుడిగా, సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌లో ఉన్న సుబ్బరామిరెడ్డికి గాంధీ కుటుంబీకులతో కూడా ఆత్మీయ సంబంధాలున్న సంగతి అందరికీ తెలిసిందే.

## డాక్టర్ కలికి స్వాతికి అరుదైన గుర్తింపు

### ప్రపంచ అగ్రశ్రేణి పరిశోధకుల జాబితాలో మన నెల్లూరు వైద్యురాలు



ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం తాజాగా విశ్వవ్యాప్తంగా జరిపిన అధ్యయనంలో ప్రపంచవ్యాప్తంగా అగ్రగణ్యులైన పరిశోధకులలో 11 మంది హైదరాబాదులోని ఎల్.వి.ప్రసాద్ ఐ హాస్పిటల్‌కి చెందినవారు ఉండడం గమనార్హం. అయితే ఆ పదకొండు మందిలో ఒకరు మన నెల్లూరీయురాలు కావడం గర్వకారణం. ఈ పదకొండు మంది అగ్రశ్రేణి పరిశోధకులలో డాక్టర్ కలికి స్వాతి కూడా ఉన్నారు. కంటి సంబంధిత క్యాన్సర్ వ్యాధికి చికిత్స అందించడంతో పాటు కంటి ప్లాస్టిక్ సర్జరీలో కూడా నిష్ణాతురాలిగా ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రిలో సేవలందిస్తున్నారు డాక్టర్ స్వాతి కలికి. కంటి సంబంధిత క్యాన్సర్‌పై వెలువడే 3 అంతర్జాతీయ పత్రికలకు ఆమె వైద్య విభాగానికి ఎడిటర్‌గా కూడా ఉన్నారు. వాటితో మరో 20 ప్రముఖ జర్నల్స్‌లో సమీక్షకురాలిగా కూడా వ్యవహరిస్తున్నారు. 212కిపైగా ఆమె రాసిన పరిశోధనాత్మక వ్యాసాలు అంతర్జాతీయంగా వివిధ సందర్భాలలో పలు పత్రికలలో ప్రచురితమయ్యాయి. అంతర్జాతీయంగా అనేక సెమినార్లలో, కాన్ఫరెన్స్‌లలో పాల్గొన్న ఆమె 256 ఉపన్యాసాలు చేశారు. వీటిలో 3 అత్యంత ప్రధానమైనవి కూడా. జాతీయ, అంతర్జాతీయంగా ఇప్పటివరకు 16 ప్రతిష్టాత్మక అవార్డులను డాక్టర్ స్వాతి అందుకున్నారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రపంచ వ్యాప్తంగా గుర్తించిన పరిశోధకులలో డాక్టర్ స్వాతి ఉండడం అభినందనీయం. బాలాజీ వేర్‌హౌసింగ్ కంపెనీ వ్యవస్థాపకులు, మన జిల్లావాసి కలికి కోదండరామిరెడ్డి కుమార్తె డాక్టర్ స్వాతి. యువ పరిశోధక వైద్యురాలికి 'లాయర్' అభినందనలు.

### డిసెంబర్ 26న...

# నెల్లూరులో 'నాటా సేవాడేస్'

### సేవా కార్యక్రమాలతో పాటు డాక్టర్ ప్రేమ్‌రెడ్డికి పౌరసత్కారం




వచ్చే ఏడాది జూన్‌లో అమెరికా దేశం, టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ నగరంలో జరగబోయే నాటా ఉత్సవాలకు సన్నాహాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. డల్లాస్‌లో అక్టోబర్ 22న జరిగిన బోర్డు సమావేశంలో 2023లో నిర్వహింప తలపెట్టిన నాటా సంబరాల ఏర్పాట్లపై సమీక్ష జరిగింది. ఉత్సవాలను నిర్వహించనున్న కన్వెన్షన్ సెంటర్, అతిథులు బసచేయబోయే హోటల్, తదితర ప్రాంతాలను బృందం పరిశీలించింది.

ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాటా స్ఫూర్తిప్రదాత, సంస్థ రాజపోషకులు డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే నాటా ఉత్సవాలు అద్భుతంగా ఉండబోతున్నాయని, కరోనా కారణంగా గత ఏడాది ఉత్సవాలు జరగలేదు కాబట్టి ఈసారి రెట్టింపుగా తెలుగు ప్రజలు హాజరవుతారన్న ఆశాభావం వ్యక్తంచేశారు. అందుకుతగ్గ పూర్తి ఏర్పాట్లు నాటా అధ్యక్షులు డాక్టర్ కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయన్నారు.

భారతదేశం నుండి వెళ్లిన మరో ముఖ్యఅతిథి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ నాటా చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రస్తుతించారు. నాటా పెద్దలు ప్రేమసాగర్‌రెడ్డి, నాటా అధ్యక్షులు డాక్టర్ కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి, నాటా పూర్వ అధ్యక్షులు డాక్టర్ రాఘవరెడ్డి గోశాల... అందరూ నెల్లూరు వాళ్ళు కావడంచూసి మరో నెల్లూరీయుడిగా తాను గర్విస్తున్నానని చెప్పారు.

#### నెల్లూరులో 'నాటా' సేవాడేస్

సమావేశానికి అధ్యక్షత వహించిన నాటా ప్రస్తుత అధ్యక్షులు డాక్టర్ కోర్సపాటి శ్రీధర్ మాట్లాడుతూ రాబోయే నాటా ఉత్సవాలకు డల్లాస్ వేదిక కావటం ఆనందంగా ఉందన్నారు. తనకు సహకరించిన, సహకరిస్తున్న నాటా పెద్దలకి, వారితో పాటు నాటా బోర్డు సభ్యులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్ 2022లో భారతదేశంలో జరగబోయే 'నాటా సేవాడేస్'ని కూడా విజయవంతం చేయాలని పిలువునిచ్చారు. ఈసారి జరగబోయే 'నాటా సేవాడేస్'లో పెద్దలు ప్రేమసాగర్‌రెడ్డి కూడా పాల్గొనబోతున్నారని, ఆ సందర్భంగా డిసెంబర్ 26న నెల్లూరులో భారీస్థాయిలో సేవా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, ప్రేమ్‌రెడ్డికి పెద్దఎత్తున పౌరసన్మానం చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు.

### జిల్లా విద్యా రంగంలో వికసించనున్న.. మరో విద్యాకుసుమం

## 'డాక్టర్ కిషోర్స్ రత్నం జూనియర్ కాలేజీ'





చదివిన వైద్య శాస్త్రాన్ని పక్కన పెట్టి పాఠశాలల నిర్వహణ ద్వారా సమాజానికి ఉపయోగపడే రేపటిపౌరులను తయారుచేస్తున్న కె.వి.రత్నం మాష్టారి వారసుడు డాక్టర్ కిషోర్, ఇప్పుడు మరో అడుగు ముందుకేస్తున్నారు.

2023-24 విద్యాసంవత్సరం నుండి జూనియర్ కాలేజీని ప్రారంభిస్తున్నట్లు గురువారం ఉదయం అధికారికంగా ప్రకటించారు. తొలుతగా డే స్కాలర్స్‌తో ఈ సంస్థను ప్రారంభించి అంచలంచెలుగా విస్తరిస్తామని తెలిపారు. తమ నాన్న రత్నం మాష్టారి స్ఫూర్తితో, అమ్మ పద్మావతి రత్నం ఆశీస్సులతో 'డాక్టర్ కిషోర్స్ రత్నం జూనియర్ కాలేజ్'గా తమ సంస్థ ప్రారంభమవుతుందని చెప్పారు. తనతో పాటు వానంతి, రోషిని డైరెక్టర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు.

'రత్నం' అనే పేరు తెలియనివారే రెండు తెలుగు రాష్ట్రాలలో ఉండరు. తన సొంత పేరునే సంస్థ పేరుగా పెట్టుకుని విద్యా రంగంలో తమకంటూ ఒక ప్రత్యేక బ్రాండుని సృష్టించారు రత్నం మాష్టారు.

స్కూళ్ల నిర్వహణలో తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్న కృష్ణకిషోర్ ఇప్పుడు కాలేజీల నిర్వహణలో కూడా తనదైన శైలిలో ఎదగాలని ఆకాంక్షిస్తూ 'లాయర్' అభినందనలు.

# కరెంటు కష్టాలను గట్టెక్కిస్తాం



***ఎట్టకేలకు నేలటూరులో ఏపి జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రం 3వ యూనిట్ ప్రారంభమైంది. దివంగత మహానేత హయాంలో ఇక్కడ రెండు థర్మల్ యూనిట్లు ప్రారంభమైతే, ఇప్పుడు ఆయన తనయుడు సిఎం జగన్ చేతులమీదుగా 3వ యూనిట్‌ను జాతికి అంకితం చేయడం విశేషం. దీంతో థర్మల్ వెలుగులు రాష్ట్రప్రజలకు మరింతగా అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. ఈనెల 27వ తేది గురువారం మధ్యాహ్నం నేలటూరులో ఏపి జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రం 3వ యూనిట్‌ను సిఎం జగన్ జాతికి అంకితం చేయడమే కాక, ఎంతోకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న మత్స్యకారేతరుల ప్యాకేజీ కింద రూ.35.75 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సిఎం నెల్లూరుజిల్లాపై వరాల జల్లు కురిపించారు.***

నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు కానీ, రైతాంగానికి ఉచిత విద్యుత్ అందించేందుకు కానీ..ఎలాంటి అవాంతరాలు లేకుండా, రాష్ట్రంలో కరెంటు కష్టాలన్నిటినీ గట్టెక్కిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చారు. ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పోర్టు సమీపంలోని నేలటూరులో ఆయన 800 మెగావాట్ల సామర్ధ్యంతో దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం 3వ యూనిట్‌ను జాతికి అంకితం చేశారు. దివంగత మహానేత వై.యస్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఆయన బహిరంగ సభలో మాట్లాడారు. రాష్ట్ర విద్యుదుత్పత్తి రంగంలో ఇదొక ముందడుగని అన్నారు. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో అత్యంత ఆధునికంగా నిర్మించిన ఏపి జెన్కో థర్మల్ కేంద్రానికి ఈ మూడేళ్ళలో 3200 కోట్ల రూపాయలు కేటాయించి పూర్తిచేయడం జరిగిందన్నారు. దీనిద్వారా రాష్ట్రానికి 45 శాతం విద్యుత్ అందుతుందని, రోజుకు 19 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఏపి గ్రిడ్‌కు సరఫరా అవుతుందని చెప్పారు. కృష్ణపట్నం పోర్టుకు, థర్మల్ ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతులందరికీ కృతజ్ఞతలన్నారు. ఆ తర్వాత, మత్స్యకారేతరులకు 16337 కుటుంబాల వారికి నేరుగా 35.75కోట్లను బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమచేశారు. 25కోట్లతో నేలటూరులో ఫిషింగ్ జెట్టీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మంత్రి కాకాణి కోరిన వంతెనలకు సిఎం జగన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఉప్పుకాలువపై తిరుమలమ్మపాళెం వంతెనకు రూ.12 కోట్లు, నక్కల వాగు వంతెనకు రూ. 10కోట్లు మంజూరు చేస్తున్నామని ఆయన చెప్పారు. రాష్ట్ర మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంబటి రాంబాబు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి, ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, కిలివేటి సంజీవయ్య, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్ మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నెల్లూరు బ్యారేజీకి.. 'నల్లపరెడ్డి శీనయ్య' పేరు

ఇటీవల తాను ప్రారంభోత్సవం చేసిన నెల్లూరు బ్యారేజీకి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరిక మేరకు, వారి తండ్రి.. దివంగత నేత.. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు పెడుతున్నామని సిఎం జగన్ ఈ సందర్భంగా ప్రకటించారు. అంతేకాక, దశాబ్దాలుగా గత పాలకులు పట్టించుకోని ఎంతో ముఖ్యమైన పెన్నానది వద్ద 'ముదివర్తి సబ్‌మెర్సిబుల్ చెక్‌డ్యామ్'కు 93 కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. దీంతో సముద్రంలోకి బ్యాక్‌వాటర్ వెళ్ళకుండా నివారించవచ్చని, 4 మండలాలకు మంచినీటి కొరత కూడా తీరుతుందని ముఖ్యమంత్రి అన్నారు. సోదరుడు..ఎమ్మెల్యే ప్రసన్న అడిగారు కనుక ఈ నిర్ణయాలు తీసుకున్నామని సిఎం జగన్ అన్నారు.

లాయర్
అక్టోబర్ 28, 2022

# బాలలకు 'బడిబాట' దూరమేనా?..

ఇప్పటినుంచే కాదు ఎంతోకాలం నుంచి మనదేశంలో బాలలకు 'బడిబాట' దూరంగానే ఉంటోంది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు గడిచినా బడులు పెరుగుతున్నాయే తప్ప బడులకు వెళ్ళే బాలల సంఖ్య మాత్రం అంతంతమాత్రంగానే ఉంటోంది. ముఖ్యంగా పేద, నిరుపేద వర్గాలకు చదువు అందని గగనకుసుమంగానే ఉంటోంది. అటు వ్యక్తిగత అభివృద్ధికీ, ఇటు దేశ సమగ్రాభ్యున్నతికి కూడా చదువే కీలకం అన్నది అందరికీ తెలిసిందే. కానీ, ఆ చదువు నేటికీ అందరికీ అందుబాటులో ఉండకపోతుండడం విచారకరం. దేశమంతా పాఠశాలలు వీధివీధినా విస్తరిస్తూనే ఉన్నా, ఇంకా లక్షలాది మంది పేదలు బడిబాటకు దూరంగానే ఉంటున్నారనేది ఎవరూ కాదనలేని వాస్తవం. అసలు బడులకే వెళ్ళలేని దీన స్థితిలో ఉన్నవారు కొందరైతే, విధివశాత్తూ ఏ కష్టనష్టాలకో గురై మధ్యలో బడి మానేస్తున్న వారు లక్షలాదిగానే ఉంటున్నారు. దేశంలో చెప్పుకునేందుకు లక్షల సంఖ్యలో పాఠశాలలున్నా ప్రపంచ నిరక్షరాస్యుల్లో 34 శాతం మంది మనదేశంలోనే ఉన్నట్లు నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దేశంలోను, అనేక రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు ఇటీవలి కాలంలో విద్యకు పెద్దపీట వేస్తున్నా, పేదపిల్లలను ఉచితంగానే చదివించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నా, పరిస్థితుల ప్రభావంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది బాలలు నేటికీ బడిబాటకు దూరంగానే ఉంటున్నారు. బతుకు తెరువుకు మార్గాలు కరువై, కుటుంబాల్లో పెద్దలు సతమతమవుతున్న నేపథ్యంలో, వారు తమ పిల్లల చదువులపై చొరవ చూపలేకపోతుండడం ముఖ్య కారణం. మరికొన్ని కుటుంబాల్లో పెద్దలకు చదువుల పట్ల సరైన అవగాహన లేకపోవడం, మూఢనమ్మకాలు, దురాచారాలు, ఆడపిల్లలకు చదువెందుకనే గ్రహచారాలు అన్నీ కలసి వెరసి బాలలకు విద్యా వెలుగులను దూరం చేస్తున్నాయి. కుటుంబంలో ఏ కష్టమొచ్చినా, ఏ నష్టమొచ్చినా ముందు ఆగిపోయేది ఆడపిల్లల చదువులే అవుతున్నాయి. దేశంలో దాదాపు 22 శాతం మంది ప్రజలు ఇంకా పేదరికంలో నానా కష్టాలు అనుభవిస్తూనే ఉన్నారు. సరైన ఆహారం కూడా లేక బక్కచిక్కిపోతున్నారు. ఇక వారి కుటుంబాల్లోని పిల్లలకు చదువులెక్కడ?.. పేదరికం పూర్తిస్థాయిలో తొలగిపోతే తప్ప విద్యా వెలుగులు అందరికీ అందవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో కరోనా రాకాసి వ్యాధి వచ్చిపడి చిన్నారుల బంగారు బతుకులను చిదిమేసింది. దేశంలో పాఠశాలలు కొంతకాలం మూతపడడం, కోట్లాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి కష్టాల్లో పడిపోవడంతో బాలల చదువులు కూడా నీరుగారిపోయాయి. ఆ తర్వాత కరోనా ఉపశమించి తిరిగి బడులు తెరచినా, బడులకు వెళ్ళలేకపోతున్న బాలలు దేశవ్యాప్తంగా లక్షల్లోనే ఉన్నారని నివేదికలు పేర్కొంటున్నాయి. కరోనా రాకాసివ్యాధి వీరవిహారం చేస్తున్నప్పటినుంచి మన దేశంలో చదువు మానేసిన పిల్లలు సుమారు 35 లక్షల మంది దాకా ఉన్నట్లు సాక్షాత్తూ కేంద్రప్రభుత్వ గణాంకాలే చెప్తున్నాయి కూడా. అలాంటి బాలలందరినీ ఇకనైనా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల వారు ఎక్కడికక్కడ వీలైనంత త్వరగా గుర్తించి, తల్లితండ్రులకు నచ్చజెప్పి, వారిని మళ్ళీ బడులకు చేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశవ్యాప్తంగా అక్షరాస్యత పథకాలు, బడిబాట ప్రణాళికలు మరింతగా మెరుగుపడాల్సి ఉంది. దేశంలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు అనేక పథకాలున్నా, విద్యాప్రణాళికలకు బడ్జెట్‌లో ఆశించినంత స్థాయిలో కేటాయింపులు ఉండకపోవడంతో, బాలల చదువుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా ఉంటోంది. ప్రధాని మోదీ బాలికల విద్య కోసం ప్రవేశపెట్టిన భేటీ బచావో, భేటీ పఢావో వంటి పథకాలు కూడా మరింత స్ఫూర్తితో ముందుకు సాగాల్సి ఉంటుంది. మన దేశంలో నేటికీ 11లక్షలకు పైగానే ఉపాధ్యాయుల ఖాళీలున్నట్లు అంచనా. వీటిలో 70 శాతంపైగా ఖాళీలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని అంటున్నారు. అసలు ఉపాధ్యాయులే లేనప్పుడు బడులెలా జరుగుతాయి?..ఇంత భారీ సంఖ్యలో గురువుల ఖాళీలుంటే పిల్లలకు చదువులు చెప్పేవారెవరు?.. విద్యావ్యవస్థ ఇలా అస్తవ్యస్థంగా, అవస్థలమయంగా ఇంకా ఎంతకాలం ఉండాలి?..వెంటనే ఆ ఖాళీలను భర్తీచేయాలి. ఇకనైనా ప్రభుత్వాలు కళ్ళుతెరచి చదువుకు దూరమైన బాలలందరినీ ఎక్కడికక్కడ గుర్తించి, అమ్మఒడి లాంటి బడిలోకి చేర్చడానికి పెద్దఎత్తున కార్యాచరణ చేపట్టాల్సి ఉంది. బాలల చదువుకు, వారి బంగారుభవితకు తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలతో పాటు సమాజంలోని ప్రతిఒక్కరూ అన్ని విధాలా చేయూతనందించాల్సి ఉంది.

# వీళ్లా మన నాయకులు.. ఛీ...!

రాజకీయాలలో ఓర్పు, సహనం, సంయమనం చాలా అవసరం. నాయకుడనే వాడు విచక్షణతో ప్రవర్తించాలి. నలుగురు వీధి రౌడీలను, చిల్లర గ్యాంగును పక్కన పెట్టుకుని తిరిగేవాడల్లా నాయకుడు కాలేడు. గత ప్రభుత్వంలో తెలుగుదేశం నాయకులు అసెంబ్లీ సాక్షిగా బూతుల పురాణం మొదలుపెట్టారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నేతలు మేమేం తక్కువ తిన్నామా..? అన్నట్లుగా తమ స్థాయి, హోదా మర్చిపోయి పచ్చి బూతులు వల్లించడం అలవాటు చేసుకున్నారు. ఇప్పుడు తాజాగా జనసేనాధ్యక్షుడు తన బూతు సందేశం ద్వారా తన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు వారి ద్వారా ఈ సమాజానికి ఏం చెప్పదలుచుకున్నాడో ఆయనే సెలవివ్వాలి. "వైసీపీ కొడకల్లారా చెప్పుతో కొడతా... గొంతు పట్టి నులిమి కాళ్లతో తొక్కేస్తా కొడకల్లారా" అని మాట్లాడిన పవన్ కళ్యాణ్ లాంటి వాళ్ళా మన నాయకులు...? ఛీ, వినడానికే అసహ్యంగా వుంది. ఇలాంటి అసభ్య పదజాలంతో భవిష్యత్ తరానికి తప్పుడు సందేశాలను పంపే నాయకులెవరైనా సరే వారిని సమాజం నుండి శాశ్వతంగా వెలివేయవలసిన బాధ్యత ప్రజలదే. లేదంటే పసిపిల్లలు సైతం తమ ఇళ్లలో, స్కూళ్లలో ఇలాంటి బూతులే వల్లించే స్థాయికి ఈ రాజకీయ నేతలు మన సమాజాన్ని దిగజార్చడం ఖాయం.

*ఎస్.శ్రీనివాస్‌చౌదరి, తిరుపతి.*




# దండన మరచి... దండకాలపై పడ్డారు!

"నేతలు చెబితేనే కేసు – పవర్ లేని పోలీసు" అంటూ గత వారం మన 'లాయర్' మొదటిపేజీలో రాసిన వార్త అక్షర సత్యం. అయితే ఇక్కడ ఒక విషయం ప్రస్తావించడం మర్చిపోయారు. తప్పుచేసిన వారిని దండించడం పక్కనపెట్టి దండకాలతో తమ జేబులు నింపుకుంటున్న ఖాకీల విషయం వదిలేశారు. ఆ శాఖ మొత్తం అదే పనిలో ఉందని నా ఉద్దేశ్యం కాదు. పోలీసుశాఖలో కూడా చాలామంది నిఖార్సైన అధికారులు, సిబ్బంది ఉన్నారు. అలాంటి వారు కూడా ఇప్పుడు నీరుగారి పోయారు. అధికార పార్టీ ఆగడాలకు, తమశాఖపై వారు ప్రదర్శిస్తున్న అధిపత్యానికి విసిగిపోయారు. నీతిగా, నిజాయతీగా, నిస్వార్థంగా పనిచేయాలని దృఢ సంకల్పంతో డిపార్ట్‌మెంట్లోకి వచ్చిన ఉన్నతాధికారులు సైతం సైలెంట్‌గా ఉండిపోతున్నారు. రాజకీయ అధిపత్యానికే వత్తాసుపలుకుతున్న అధికార పార్టీ అధిష్టానం తీరుచూసి వీలయితే బదిలీలపై కేంద్ర సర్వీసులకు వెళ్లిపోవాలని చూస్తున్నారు, లేదంటే తమకెందుకులే అని చూసీచూడనట్లుగా ఉండిపోతున్నారు. ఇదే అదనుగా తీసుకున్న చాలామంది దొరికిన మేరకు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. జిల్లాస్థాయి అధికారులకు కూడా ఈ వ్యవహారంలో మినహాయింపు లేదు. "మా బాసులు చాలా స్ట్రిక్ట్.. చిల్లర మామూళ్ళకు లొంగే టైపు కాదు." అంటూ తమ పైఅధికారుల పేర్లు చెప్పి దొరికిన మేరకు గుంజేసుకుంటున్నారు. మితిమీరిన రాజకీయ నాయకుల జోక్యం.. ఇలా పోలీసుశాఖలో అవినీతి జాఢ్యం ముదిరిపోవడానికి దోహదపడుతోంది. మన 'లాయర్'లో ఈ దండకాల విషయాన్ని కూడా ప్రస్తావించివుంటే బాగుండేది.

*ఎస్.ఆర్.ప్రకాష్‌రెడ్డి, నెల్లూరు.*

# సాగరతీరాల్లో.. 'కాలుష్య' కెరటాలు



ఏ ఆదివారమో.. లేదా ఏ పండుగ రోజో వస్తే చాలు.. బీచ్‌లకు వెళ్ళడం చాలామందికి పెద్ద సరదా. ఇంట్లో అన్నం పొట్లాలు కట్టుకుని, నీళ్ళబాటిళ్లు, తినుబండారాలన్నీ ప్యాక్ చేసుకుని పిల్లాపాపలతో సహా కుటుంబసభ్యులంతా సముద్రతీరానికి రావడం కొన్ని గంటలపాటు హాయిగా గడపడం అందరికీ ఇష్టమే. ముఖ్యంగా యువకులు, స్నేహితుల బృందాలు బీచ్‌లలో విహరించడం, సముద్రస్నానాలు చేయడం చాలా కాలం నుంచి ఒక అలవాటుగా ఉంది. అనంతంగా కనిపిస్తూ.. నిరంతరం అలుపులేకుండా.. అలలతో ఎగసిపడుతున్న ఆ మహాసముద్రాన్ని చూడడం కన్నులకు పండుగే. నిజంగానే అదొక అద్భుతమైన అనుభూతి. అయితే, అందమైన ఆ సాగరతీరాలు ఇప్పుడు క్రమేణా కాలుష్యం కోరల్లో చిక్కుకుపోతుండడమే బాధాకరం. సముద్రతీరాలకు వచ్చినప్పుడు తెచ్చుకున్నవి అక్కడే తినడం, తినేసిన పొట్లాలు.. ప్లాస్టిక్ కవర్లు, ఖాళీ నీళ్ళబాటిళ్ళు వగైరా వ్యర్థాలన్నిటినీ తీరంలోనే పారేసిపోవడం సముద్ర సందర్శకులకు ఒక దురలవాటుగానే ఉంది. నిత్యం ఎంతో మంది అసంఖ్యాకంగా సాగరతీరాలకు వస్తూ పోతూనే ఉంటారు. జిల్లాలో మైపాడు బీచ్, తూపిలిపాళెం బీచ్, కొత్త కోడూరు బీచ్ వంటి ప్రసిద్ధమైన బీచ్‌లు ఉన్నాయి. వాటితో పాటు పాతనెల్లూరు జిల్లా ప్రకారం తడ నుంచి తెట్టు దాకా జిల్లా సముద్రతీరంలో వందలాది గ్రామాలున్నాయి. బీచ్‌లుగా పేరు లేకపోయినా, ఆయాప్రాంతాల్లో ఉన్న జనం ఈ తీరాలకు తరచూ వచ్చి సేదతీరుతుండడం సర్వసాధారణంగా జరుగుతూనే ఉంటుంది. ఈ సందర్భాల్లో ఏవో తినుబండారాలు తెచ్చుకుని తినడం

## సమస్యల తో 'రణం'

అన్నది తప్పదు మరి!..కానీ వచ్చిన సమస్యల్లా ఏమిటంటే, తిన్న తర్వాత మిగిలిన వ్యర్థాలను అక్కడే పారేయడం. అందులోనూ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ నీళ్ళ బాటిళ్ళు ఎక్కువ. ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలుగా ఉంటున్నాయి. చివరికి ఆ మురిగిపోయిన వ్యర్థాలన్నీ గాలికి క్రమేణా సముద్రంలో కలసిపోతున్నాయి. ఆ వ్యర్థాలతో చివరికి సముద్రం కూడా కలుషితమవుతోందంటే అతిశయోక్తి కాదు. చూసేందుకు చిన్నదిగా అనిపించినా, ఇది చాలా పెద్ద సమస్య. ఈ కాలుష్యం వల్ల సముద్రజీవుల మనుగడ కూడా ప్రశ్నార్థకమైపోతోందని నిపుణుల ఆవేదన.

సాగర తీరాల్లో వ్యర్థపదార్థాలతో చివరికి సాగరాలే కలుషితమవుతుండడాన్ని చూసి ఆందోళన వ్యక్తం చేస్తూ సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పలు సందర్భాల్లో సాగర తీరాల వెంట నడుచుకుంటూ వెళ్లి వ్యర్థాలను తానే స్వయంగా తొలగిస్తున్న దృశ్యాలు ప్రచార ప్రసారమాధ్యమాల్లో అనేకసార్లు మనం చూసే ఉంటాం. మనం తినే ఆహారపదార్థాల వ్యర్థాలను, నీటి బాటిళ్ళను, ప్లాస్టిక్ కవర్లను తీరంలో పారేయకుంటే ఈ సమస్య అంతగా ఉండేది కాదు. స్వచ్ఛభారత్ స్ఫూర్తితో అప్పుడప్పుడూ ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి తదితర స్వచ్ఛందసంస్థల వారు, స్వచ్ఛభారత్ బృందాలు సాగరతీరాల్లో ఉన్న వ్యర్థాలను తొలగిస్తున్నారు. ఎల్లకాలం ఎవరో ఒకరు ఇలాంటివి చేయాలా?.. మనం తిని పారేసిన, తాగి విసిరేసిన వాటిని మరెవరో వచ్చి ఏరివేయడం.. ఎంత సిగ్గుచేటో కదా అని అనుకోలేకపోతున్నాం. ఇలాంటివన్నీ ఎవరికి వారు విజ్ఞతతో ఆలోచించుకోవాలి. మనవల్ల మరెవరికీ ఇబ్బంది లేకుండా చూడాలి. ఆయా ప్రాంతాల్లో ఉన్న అధికారగణం కూడా వీటిపై దృష్టిపెట్టి, బీచ్‌ల వద్ద, తరచూ జనం వచ్చే సాగరతీరాల వద్ద డస్ట్‌బిన్‌లను ఏర్పాటుచేయాలి. సూచనల బోర్డులు పెట్టాలి. తిని, తాగిపారేసిన వ్యర్థాలు గుట్టలుగా.. కొండలుగా పేరుకుపోతున్నా పట్టించుకోకపోతే ఎలా?. వారానికోసారైనా గ్రామాల్లోని యువకులు, స్వచ్ఛంద సేవకులు, అధికార బృందాలతో కలసి సాగరతీరాల్లోని వ్యర్థాలను ఏరివేస్తుండాలి. వ్యర్థాలు సముద్రంలో కలసిపోకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి. బీచ్‌లు, సాగరతీర ప్రాంతాలు అందంగా, ఆరోగ్యకరంగా, ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలి.

## మానవ మనుగడకే ప్రమాదంగా వ్యర్థాలు

సముద్రాల వల్లనే భూమాత స్వచ్ఛమైన గాలిపీలుస్తూ ఉంది. మనకు ప్రాణవాయువు వచ్చేది అత్యధికశాతం సముద్రాల నుంచే. కొండలు, కోనలు, నదులు, సముద్రాలు వగైరాలన్నీ ప్రకృతి మనకిచ్చిన వరాలు. వాటిని కాపాడుకోవాలే తప్ప నాశనం చేయకూడదు. కూర్చున్న కొమ్మనే నరుక్కునే సామెతగా ఉండకూడదు. సముద్రాలను కలుషితం చేయడం మానవ మనుగడకే ప్రమాదకరం. అందుకే, సందర్శకులు వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యర్థాలతో గబ్బుకొట్టిపోతున్న సాగరతీరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు, సముద్రాన్ని కాలుష్యం నుంచి కాపాడేందుకు జిల్లా ఉన్నతాధికారులు ఎక్కడికక్కడ వ్యవస్థలను పటిష్టం చేయాలి. స్వచ్ఛంద సంస్థలతో, పర్యావరణ హితులతో చర్చించి, ఈ కాలుష్యం నివారణకు శాశ్వత ప్రాతిపదికపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే మనకే కాదు.. భావితరాల వారికి కూడా ప్రమాదమే!

- సంచారి




# మన వెంకయ్య ఇంట.. భారత ప్రధాని

## స్వయంగా వెళ్లి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన నరేంద్ర మోడీ

13వ ఉపరాష్ట్రపతిగా భరతజాతి గర్వించదగిన సేవలు అందించిన మన వెంకయ్యనాయుడి ఇంట భారత ప్రధాని నరేంద్ర మోడీ సందడి చేశారు. అక్టోబర్ 24వ తేదీ దీపావళి పర్వదినం సందర్భంగా ఉదయం దేశ సరిహద్దులోని కార్గిల్ ప్రాంతంలో మన సిపాయిలతో ఉల్లాసంగా గడిపి, రాజధానికి తిరిగి వచ్చిన ప్రధాని, అదేరోజు సాయంత్రం ఢిల్లీలోని వెంకయ్య నివాసానికి వచ్చారు. నెం.1, త్యాగరాజ్ మార్గ్‌లోని వెంకయ్యనాయుడు నివాసంలో గంటకుపైగా గడిపారు మోడీ. వెంకయ్య – ఉషమ్మ దంపతులతో పాటు ఆయన కుమారుడు హర్షవర్ధన్, మనుమరాలు నిహారిక, ఆమె భర్త రవితేజలు ప్రధానికి స్వాగతం పలికారు. అనంతరం మోడీ, వెంకయ్య కుటుంబసభ్యులతో పాటు ఆయన వ్యక్తిగత సిబ్బందితో సరదాగా గడిపి అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

దీపావళి సందర్భంగా సరిహద్దుకు వెళ్ళి దేశానికి రక్షణగా నిలుస్తున్న సైనికులతో పండుగ జరుపుకోవడం ఆనందాన్ని కలిగిస్తే, వెంకయ్యనాయుడు ఇంటికి వెళ్ళి ఆయనతో సాయంసమయం గడపడం తనకు ఉత్సాహాన్నిచ్చిందని సామాజిక మధ్యమాల్లో ప్రధాని మోడీ పేర్కొనడం గమనార్హం.

దటీజ్ వెంకయ్య!



భారత్ జోడో యాత్రలో భాగంగా ఇటీవల తెలంగాణాలో ప్రవేశించిన రాహుల్‌గాంధీకి స్వాగతం పలుకుతున్న కేంద్ర మాజీ మంత్రి, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ శాశ్వత ఆహ్వానితులు డాక్టర్ తిక్కవరపు సుబ్బారామిరెడ్డి.




# 'శివ మాల' ధారణతో.. సకల శుభాలు

- ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో 23 వరకు శివ దీక్షలు
- నవంబరు 16 నుంచి 'శివ పంచాక్షరీమంత్ర జపం'

ఆ పరమశివునికి ఎంతో ప్రీతిపాత్రమైనదిగా, శివారాధనకు ఎంతో శుభప్రదమైనదిగా భావించే ఈ కార్తీకమాసంలో నెల్లూరులో ఎంతో వేడుకగా కార్తీక దీప మహోత్సవాలు జరుగుతున్నాయి. కార్తీక దీపారాధనలతో ఆలయాలు కళకళలాడుతున్న వేళ, శివదీక్షా ధారణలతో భక్తులు 'ఓం నమ: శివాయ' అంటూ ఆ పరమేశ్వరునికి భక్తితత్పరతలతో విశిష్ట పూజలు చేయడం ఆనవాయితీ.

ఈ కార్తీకమాసంలో నెల్లూరు మూలస్థానేశ్వరాలయంలో అక్టోబరు 26 నుంచి శివదీక్షా మాలధారణ కార్యక్రమం ప్రారంభమైంది. వచ్చే నవంబరు 23వ తేది వరకు జరిగే ఈ కార్యక్రమంలో శివదీక్షా మాలలు ధరించిన భక్తులు నిర్విరామంగా శివ పంచాక్షరీజపం, శివ భజనలతో, అఖండ శివనామ స్మరణలతో తమ జీవితాలను ధన్యం చేసుకుంటారు.



భక్తులకు శివదీక్షా వస్త్రాలను అందజేస్తున్న ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి

### ఆల్తూరు ఆధ్వర్యంలో..

పరమ శివునికి పరమభక్తుడు, శివమాల ధారణకు వ్యవస్థాపక అధ్యక్షుడు, నెల్లూరులోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయం మాజీ ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 26న శివ మాలధారణ ఆరంభమైంది. ఈ పుణ్యకార్యం ఆద్యంతం జయప్రదంగా జరిగేందుకు ఆయన అన్ని ఏర్పాట్లు చేశారు. కార్తీకమాసంలో పరమ శివుని పూజించుకోవడం పూర్వజన్మ సుకృతమని, ఆ భగవంతుని కృపతో భక్తుల జీవితాలకు సకల శుభాలు కలుగుతాయని ఆల్తూరు ఈ సందర్భంగా పేర్కొన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని ఆ పరమశివుని కరుణా కటాక్ష వీక్షణాలకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తిచేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆరంబాకం వేణుగోపాల్, కెవిఆర్ విజయకుమార్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితర ప్రముఖులు శివదీక్ష ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. శివదీక్షలు చేపట్టిన భక్తులకు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి ఉచితంగా శివదీక్షా వస్త్రాలతో పాటు, ప్రతినిత్యం సాయంత్రం వేళ వారికి అల్పాహారం కూడా సమకూరుస్తున్నారు.

### నిర్విరామంగా శివ నామస్మరణలు

ఈ సందర్భంగా ఆలయంలో నవంబరు 16న 'శివ పంచాక్షరీ సప్తాహం'తో పాటు, అదేరోజు నుంచి వారం రోజుల పాటు నిర్విరామంగా 'ఓం నమ:శివాయ' అంటూ 'శివ పంచాక్షరీ మంత్రజపం' నిర్వహించనున్నారు. నవంబరు 22వతేదీ భక్తులకు రంగనాయకులపేటలో ఇరుముడి కార్యక్రమం నిర్వహించిన తర్వాత, ఆ రోజు సాయంత్రం ద్వాదశ జ్యోతిర్లింగ కలశాలతో నగరంలో భారీ యాత్ర జరుగుతుంది. అనంతరం శ్రీ మూలస్థానేశ్వరునికి మహాభిషేకం చేయనున్నారు. దీంతో.. ఎంతో పుణ్యప్రదమైన ఈ కార్యక్రమాల్లో భక్తులు భారీగా పాల్గొని మాలధారణ చేసి, ముక్కంటి సేవలు చేయడానికి శ్రీ మూలస్థానేశ్వరాలయానికి పెద్దసంఖ్యలో కదలివస్తున్నారు.

### కార్తీక శోభతో ఆలయం కళకళ

అక్టోబర్ 26 నుండి కార్తీక మాసం ప్రారంభం కావడంతో మూలస్థానేశ్వరాలయం కార్తీక దీపకాంతులతో కళకళలాడుతోంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మూలస్థానేశ్వరుని దర్శించుకుని తరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి విశిష్ట పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని నిర్వాహకులు విద్యుత్ దీపాలతో శోభాయమానం చేశారు.

# 'తంగిరాల మహాభారతం'

**27వ భాగం**

ధృతరాష్ట్రుడు గుడ్డివాడయినా పాండురాజు సహకరిస్తూ, సైన్యంతో దండెత్తి శత్రువులను ఓడించి ధన, కనక రాశులు, వేలకొలది గుర్రాలు, ఏనుగులు, గోవులు తెచ్చి ధృతరాష్ట్రుడుకి సమర్పిస్తాడు. ఆ ధనంతో ధృతరాష్ట్రుడు 100 అశ్వమేధయాగాలు చేస్తాడు.

పాండురాజుకి వేట అంటే అమితమయిన ఇష్టం. ఒకసారి కుంతిని, మాద్రిని వెంటబెట్టుకుని అడవిలోకి వెళ్లి అక్కడ విడిదిచేసి రోజూ అడవిలో ఉన్న జంతువుల్ని వేటాడుతూ ఉంటాడు. ఒక రోజు ఒక్క జంతువు కూడా దొరకలేదు. విసిగిపోయి ఉన్న సమయంలో రెండు జింకలు కామక్రీడలో విహరిస్తుంటాయి. పాండురాజు ఆలోచించుకోకుండా వాటి మీద 5 బాణాలు వేస్తాడు. ఆ రెండు జింకలు కుప్పకూలిపోతాయి. వాటిలో మగ జింక మనుష్య భాషలో... తాను, 'కిందముడు' అనే మునీశ్వరునని, తాను, తన భార్య జింకల రూపంలో కామసుఖాలు అనుభవిస్తున్నామని చెప్పి, పాండురాజుని ఎందుకిలా చేసావు, అధర్మం కాదా? అని అడిగినప్పుడు పాండురాజు తాను చేసిన పని సమర్థించుకుంటాడు. అప్పుడు మునీంద్రునికి కోపం వచ్చి 'నీవు కూడా నీ భార్యలతో సాంగత్యం చేసినప్పుడు, నీవు, నీ భార్య కూడా మరణిస్తారని' శపిస్తాడు. ఆ తర్వాత ముని దంపతులిద్దరు మరణిస్తారు. పాండురాజు కలత చెంది, సన్యాసం స్వీకరిస్తాడు.

పాండురాజు ఆ మృగశాపం వలన పిల్లలు పుట్టకబోవటంతో, కుంతి తనకు దుర్వాసుడు ఇచ్చిన మంత్రం వలన దైవాంశలతో పాండవులు పుట్టటానికి దోహదపడుతుంది.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.**
**పూర్తి నిడివి కోసం**
**Syam Tangirala Mahabharatam@YouTubeలో చూడగలరు.**



# నెల్లూరు కబుర్లు



## ఎంపీ ఆదాలను కలిసిన ఎల్ఐసి ఏజెంట్లు

నెల్లూరు డివిజన్లోని చిత్తూరు నెల్లూరు ప్రకాశం జిల్లాల్లో జీవిత బీమా ఏజెంట్ల ప్రతినిధులు ఇటీవల నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఎల్ఐసి యాజమాన్యంతో మాట్లాడి, తమ కనీస సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏజెంట్లందరికీ మెడి క్లెయిమ్ వర్తింపజేయాలని, గ్రాట్యుటీని పెంచి, ప్రీమియంలపై జిఎస్టీని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ల నేతలు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, విశ్వనాథరెడ్డి, హజరత్‌రెడ్డి, షావుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్ర రైతులపై.. దాడులు దారుణం

**- సిపిఐ ఆందోళన**



అమరావతి రైతుల దీక్షలకు మద్దతుగా తూర్పు గోదావరి జిల్లాలో పాదయాత్ర చేస్తున్న రైతులపై పోలీసు దాడులు దారుణమని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు సయ్యద్ సిరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు చర్యలను ఖండిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 23న నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలి వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు షానవాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, నగర కార్యదర్శి మధు, రమణయ్య, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మూలస్థానేశ్వరాలయంలో.. పవిత్రోత్సవాలు



నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఇటీవల మూడు రోజుల పాటు వైభవంగా పవిత్రోత్సవాలు నిర్వహించారు. కంచి కామకోటి పీఠం అర్చకులు, వేదపండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. వేద మంత్రోచ్చాటనలతో హోమాలు చేశారు. అనంతరం కన్నుల పండువుగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## విద్యుత్ సేవల మెరుగుకు..'స్కేడా సిస్టం'



ఎస్ఇ విజయకుమార్‌రెడ్డి

విద్యుత్‌సేవలను మరింతగా మెరుగు చేసుకునేందుకు 'స్కేడా సిస్టం' ఎంతగానో దోహదపడుతోందని, నెల్లూరు విద్యుత్ సెక్షన్లలో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అనుసరించేందుకు కృషిచేస్తున్నామని ఏపిఎస్‌పిడిసిఎల్ కె.విజయ కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 23న నెల్లూరులో ఆయన విద్యుత్ అధికారులతో సమావేశమై మాట్లాడారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్న నేటి తరుణంలో విద్యుత్ రంగంలోనూ విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయన్నారు. విద్యుత్‌స్టేషన్లను ఆటోమేషన్‌లోకి తీసుకురావడం, విద్యుత్ అంతరాయాలను తొలగించడం, నిరంతర విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించడం వంటివాటికి స్కేడా సిస్టం కీలకంగా ఉండబోతోందన్నారు. అధికారులంతా ఆ సేవల మెరుగుదలకు, లక్ష్యసాధనతో కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో టెక్నికల్ ఏఇ పరంధామయ్యతో పాటు డిఇలు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## అదరగొట్టేశాడు

### ఈతకొట్టాడు.. స్వర్ణం తెచ్చాడు



నెల్లూరు మాగుంట లే-అవుట్‌కు చెందిన రిషి.. రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అదరగొట్టేశాడు. అండర్-14 విభాగంలో అందరికంటే అపూర్వమైన ప్రతిభతో రాణించి స్వర్ణపతకం సాధించాడు. విజయవాడలో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో 50 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో బంగారు పతకంతో పాటు, 100 మీటర్ల విభాగంలో రజత పతకం కూడా పొందాడు. 'శాప్' ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చేతులమీదుగా రిషి ఈ పతకాలను అందుకున్నారు. కోచ్ బాలయ్య ఈ బాలుడికి శిక్షణ ఇచ్చారు. పతకాలు సాధించినందుకు రిషిని అందరూ అభినందించారు.

## నవంబరు 2న..జడ్పీ సమావేశం

నెల్లూరు జిల్లాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నవంబరు 2న జరుగుతుందని, జడ్పీటిసి సభ్యులు, అధికారులు హాజరు కావాలని, ఈ సమావేశంలో పలు ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహిస్తారని జడ్పీ సిఇఓ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖలవారు తమ శాఖలకు సంబంధించిన నివేదికలు సమర్పించాలని కోరారు.

## పోలియోపై రోటరీ అవగాహన

ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో ఇటీవల నగరంలో ర్యాలీ చేపట్టి, పోలియో నివారణపై అవగాహన కల్పించారు. రోటరీ ఆడిటోరియం నుంచి గాంధీబొమ్మ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. రోటరీ అధ్యక్ష కార్యదర్శులు శేఖర్‌రెడ్డి, సమీవుల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ పెంచలయ్య, పోలియో నివారణ కోఆర్డినేటర్ భరత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాసుపత్రికి 'లయన్స్' వితరణ



నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి నెల్లూరు ప్రియదర్శిని లయన్స్ క్లబ్ వారు రోగుల సౌకర్యార్థం బీపీ మిషన్లను వితరణగా అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సువర్ణ శేషాద్రి, అఖిల, కోశాధికారి కల్యాణి, జయశ్రీ తదితరులు వాటిని ఆసుపత్రి ఆర్ఎంఓ కళారాణి, డాక్టర్ సుబ్రహ్మణ్యంలకు అందజేశారు.

## ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు



ప్రముఖ హీరో ప్రభాస్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈనెల 24న నెల్లూరులోని ప్రభాస్ అభిమానులు కేకు కట్ చేసి అందరికీ పంచారు. ప్రభాస్ జిల్లా యువసేన ఆధ్వర్యంలో, స్థానిక బాలాజీనగర్‌లో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా సుమారు 500 మందికి అన్నదానం చేశారు. యువసేన గౌరవాధ్యక్షులు వంశీకృష్ణ, అధ్యక్షులు అశోక్‌తో పాటు సునీల్, ప్రసాద్, సుధ, అక్బర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## వీధికుక్కల నియంత్రణకు చర్యలు



నెల్లూరు నగరంలో వీధికుక్కల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఇటీవల ఆమె పాత మునిసిపల్ కార్యాలయం ప్రాంగణంలోని వీధికుక్కల జనన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ వైద్య కేంద్రంలో శునకాలకు జరుగుతున్న శస్త్రచికిత్సలను, వాటి గాయాలకు మందులు వేయడం, ఆహారం అందించడం వంటి కార్యక్రమాలన్నిటినీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శస్త్ర చికిత్సలతో రానున్న రోజుల్లో శునకాల సంతతిని నియంత్రించవచ్చన్నారు. నగరపాలక సంస్థ పశు వైద్యాధికారి డాక్టర్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆనందాల.. దీపావళి



దీపావళి సంబరాలను ఈనెల 23- 24న జిల్లా ప్రజలు వేడుకగా, ఆనంద సంబరంగా జరుపుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకయిన దీపావళి రోజున ప్రజలు ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. దీపాలు వెలిగించి దీపకాంతులతో ఆలయాలను, ఇళ్లను ప్రకాశమానం చేశారు. చిన్నా పెద్దా అంతా కలిసి బాణసంచా వేడుకలతో ఆనందించారు.



## పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

**విఎస్‌యు వీసీ సుందరవల్లి**

ఆరోగ్యాన్ని పాడుచేసే పొగాకు మరియు సంబంధిత ఉత్పత్తులకు యువత దూరంగా ఉండాలని, వాటిని వినియోగించరాదని విఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి విద్యార్థులకు పిలుపునిచ్చారు. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో, జాతీయ సేవా పథకం సహకారంతో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా విఎస్‌యులో ఈనెల22న 'పొగాకు రహిత విద్యాలయాలు' అనే అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చలన చిత్రాల ప్రభావం యువతపై ఎంతో ఉందని, అందువల్ల ఆ చిత్రాల్లో మద్యం సేవించడం, పొగ తాగడం వంటి సన్నివేశాలు వీలైనంతవరకు లేకుండా ఉంటే మంచిదని సూచించారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా. పి.రామచంద్రరెడ్డి మాట్లాడుతూ, పొగాకు వలన జరిగే అనర్థాలను శాస్త్రీయ విధానంలో వివరించారు. ఆచార్య ఎన్.ఖాదర్‌వలీ అందరి చేత పొగాకుకు దూరంగా ఉండేటట్లు ప్రతిజ్ఞ చేయించారు. ఆచార్య జి.విజయ ఆనందకుమార్‌బాబు అధ్యక్షత వహించగా, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఉదయ్‌శంకర్ అల్లం కార్యనిర్వాహకునిగా వ్యవహరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి ఎం.హాసిని, సామాజిక కార్యకర్త జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్‌లో.. బాగా రాణించాలి

**● పుల్లెల గోపీచంద్ ఆకాంక్ష**



జిల్లాలోని బ్యాడ్మింటన్ క్రీడాకారులు మంచి నైపుణ్యంతో బాగా రాణించాలని జాతీయ స్థాయి క్రీడాకారుడు, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఆకాంక్షించారు. ఇటీవల ఆయన నెల్లూరులో రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు, 'నుడా' ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్‌ను కలిశారు. జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీర వెంకటేశ్వర్లు, రంగారెడ్డిజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నాయకులు బాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

**- ఛైర్‌పర్సన్ దొంతు శారద**



జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద చెప్పారు. ఈనెల 23న నెల్లూరులోని నవాబుపేటలో ఉన్న శ్రీ రామకృష్ణ శాఖా గ్రంథాలయాన్ని ఆమె సందర్శించి రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయ నిర్వహణ చక్కగా ఉండాలని, పాఠకులకు అవసరమైన వసతులు బాగా ఉండాలని ఆమె సిబ్బందికి చెప్పారు. త్వరలోనే మరిన్ని పుస్తకాలు అందజేస్తామన్నారు.

# ‘భారీ’ విజయం

*అందరూ అనుకుంటున్నట్లుగానే శ్రీహరికోట శాస్త్రవేత్తలు మరో గగ(ఘ)న విజయం సాధించారు. ఒకేసారి 36 ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలోకి జయప్రదంగా విడిచిపెట్టి భారీ రాకెట్ ద్వారా ఇస్రో భారీ విజయాన్నే సాధించింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు చెందిన అత్యంత బరువైన రాకెట్ ఇది. 5.21 టన్నుల బరువును అవలీలగా మోసుకుంటూ వెళ్ళి ఆ రాకెట్ నిర్ధేశించిన కక్ష్యలో వరుసగా ఉపగ్రహాలను ప్రవేశపెడుతూ వెళ్ళడం ఒక అద్భుతం. జిఎస్ఎల్వి మార్క్-3 రాకెట్ ప్రయోగం సూపర్ సక్సెస్ అయింది. జిఎస్ఎల్వి వంటి భారీ రాకెట్ ప్రయోగాల్లో సైతం అగ్రరాజ్యాలకు ధీటుగా ఇస్రో శాస్త్రవేత్తలు భారత్‌కు తిరుగులేదని నిరూపించారు. అందులోనూ వాణిజ్య ఉపగ్రహాల ప్రయోగంలోనూ వరుస విజయాలు సాధిస్తూనే ఉన్నారు. ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్ ఆధ్వర్యంలో, శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుంచి అత్యంత బరువైన ఈ రాకెట్ ప్రయోగం సక్సెస్ కావడంతో ఇస్రోలోని అంతరిక్ష శాస్త్రవేత్తలతో పాటు దేశప్రజలంతా సంతోషిస్తున్నారు. అందులోనూ దీపావళి ముందురోజునే ఈ రాకెట్ విజయం శుభపరిణామం. భారత శాస్త్రవేత్తలకిది గర్వకారణమైన విజయం.*

భారత అంతరిక్షరంగంలో ఇది చరిత్రాత్మకమైన ప్రయోగం. ఒకేసారి 32 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడం శాస్త్రవేత్తల ప్రతిభాపాటవాలకి నిదర్శనం. ఈనెల 22న, శనివారం అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలా 7 నిమిషాల 40 సెకన్లకి ఈ బాహుబలి రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దిగ్విజయంగా దూసుకుపోయింది. భారత అంతరిక్ష శాస్త్రవేత్తల ఘనతల్లో మరో విజయాన్ని నమోదు చేసింది. ముందు రోజు నుంచి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 24 గంటల అనంతరం షార్‌లోని రెండవ లాంచ్‌ప్యాడ్ నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించారు. కేవలం 20 నిమిషాల వ్యవధిలోనే ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఈ దృశ్యాలతో హిందూ మహాసముద్రంలో మన శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గ్రౌండ్ స్టేషన్లకు సంకేతాలు అందుతున్నాయి కూడా.

## మార్క్-3 ప్రయోగాల్లో ఇది 5వ విజయం

ఇప్పటిదాకా పిఎస్ఎల్వి రాకెట్లలో విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించిన ఇస్రో ఈ విజయంతో ఇక నుంచి జిఎస్ఎల్వి రాకెట్ల ద్వారా అత్యంత బరువైన ఉపగ్రహాలను కూడా నింగిలోకి పంపగలుగుతుండడం అపూర్వం. 2014 డిసెంబరు 14న మొట్టమొదటిసారిగా క్రయోజనిక్ సాయంతో జిఎస్ఎల్వి మార్క్-3 ద్వారా క్రూమాడ్యూల్‌ను విజయవంతంగా రోదసిలోకి పంపారు. ఆ తర్వాత 2017 జూన్ 5న మార్క్-3 ద్వారా జీశాట్-19 ఉపగ్రహాన్ని, 2018లో నవంబరు 14న జీశాట్-29 ఉపగ్రహాన్ని పంపారు. ఇప్పటిదాకా పంపిన ఈ నాలుగు జిఎస్ఎల్వి రాకెట్లు కూడా విజయవంతమయ్యాయి. తాజాగా మార్క్-3 విజయం అయిదవది కావడం విశేషం.

## 5796 కేజీల బరువును మోసుకెళ్లిన.. భారీ రాకెట్

43.5 మీటర్ల ఎత్తయిన జిఎస్ఎల్వి మార్క్-3 రాకెట్‌లో, 5796 కేజీల బరువున్న 36 బ్రాడ్‌బ్యాండ్ సమాచార పోలార్ లోయర్‌ఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టడం ద్వారా వాణిజ్యఘట్టానికి ఇస్రో శ్రీకారం చుట్టడం చరిత్రాత్మకం. వీటివల్ల ఇస్రోకు మంచి ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. ఏదేమైనా ఇస్రో వాణిజ్య ప్రయోగాలకు ఇది మరో ముందడుగు అని చెప్పవచ్చు. బ్రిటన్‌కు చెందిన వన్‌వెబ్ ఇండియా-1 అభివృద్ధి చేసిన 36 ఉపగ్రహాలను నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేటెడ్ లిమిటెడ్, న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఈ ప్రయోగం ద్వారా పంపారు. వచ్చే ఏడాది కూడా వన్‌వెబ్‌కు చెందిన మరికొన్ని ఉపగ్రహాల ప్రయోగాలకు ఇస్రో సిద్ధమవుతోంది.



## నింగిలోకి దూసుకువెళ్లిన ‘బాహుబలి’ రాకెట్
## ఒకేసారి 36 ఉపగ్రహాలు అంతరిక్షంలోకి
## జిఎస్ఎల్వి మార్క్-3 సక్సెస్

## జూన్‌లో.. ‘చంద్రయాన్’



ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్

ఇక త్వరలోనే చంద్రయాన్, గగన్‌యాన్ ప్రయోగాలు కూడా ఉంటాయని ఇస్రో ఛైర్మెన్ ఎస్.సోమనాథ్ చెప్పారు. జిఎస్ ఎల్వి మార్క్-3 ప్రయోగ విజయం అనంతరం శ్రీహరికోటలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మానవ రహిత ప్రయోగంతో పాటు మానవ సహిత ప్రయోగం కూడా ఈ జిఎస్ఎల్వి రాకెట్‌లతోనే ఉంటుందన్నారు. అంతేకాక, ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 4 రాకెట్ ప్రయోగాలుంటాయని, వాటిలో సూర్యునిపై పరిశోధనలకు ఆదిత్య ఎల్-1 ఉపగ్రహ ప్రయోగాలు కూడా జరుపుతామన్నారు. జిఎస్ ఎల్వి మార్క్-3 ప్రయోగానికి ముందు ఈనెల 20న ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ, వచ్చే ఏడాది జూన్‌లో జాబిల్లిపైకి కూడా చంద్రయాన్-3 ప్రయోగానికి ముహూర్తం నిర్ణయించామన్నారు. ‘లాంచ్ వెహికిల్ మార్క్-3’ (ఎల్వివిఎం-3) ద్వారా చంద్రయాన్ ప్రయోగం జరుగుతుందన్నారు. గతంలో కంటే పటిష్టమైన రోవర్‌ను దానిద్వారా చంద్రునిపైకి పంపేందుకు కృషిజరుగుతోందని చెప్పారు. మానవ సహిత అంతరిక్ష యాత్ర ‘గగన్‌యాన్’ను 2024లో చేపడతామని, అందుకు వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపడానికి అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. అన్నిరకాల పరీక్షలు, అన్నివిధాల పరిశీలనలన్నీ పూర్తయ్యాక, మునుపటికంటే కట్టుదిట్టమైన రీతిలో ఈ ప్రయోగాలు జరుగుతాయని ఆయన వివరించారు.

## అన్ని వ్యవస్థలు సజావుగా నడవాలంటే..

# పోలీసులే కీలకం

### పోలీసు అమరవీరుల సంస్మరణలో మంత్రి కాకాణి



సమాజంలో అన్ని వ్యవస్థలు సజావుగా నడవాలంటే పోలీసుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. శాంతి భద్రతలను పటిష్టంగా ఉండేలా నిరంతరం కృషిచేసేది పోలీసులేనని, ఎంతో బాధ్యతగా, అంకితభావంతో వారు చేస్తున్న సేవలు అపారమని, వారి త్యాగనిరతి అమూల్యమని ఆయన కొనియాడారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు పోలీసులు చేస్తున్న సేవలు విస్మరించలేనివని ఈ కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కొనియాడారు. జిల్లా ఎస్పీ విజయారావు మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఎంతోమంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోతున్నారని, వారి త్యాగాలను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని అన్నారు. గత ఏడాది వరదల సమయంలో ఇద్దరి ప్రాణాలు కాపాడుతూ ఒక ఎస్‌డిఆర్‌ఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందారని తెలిపారు. అనంతరం, స్మారక స్థూపానికి పూలమాలలు వేసి, పోలీసు అమరవీరులందరికీ నివాళులర్పించారు. ఈ ఏడాది మరణించిన పోలీసుల కుటుంబాలకు లక్ష రూపాయల వంతున చెక్కులు పంపిణీ చేశారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు 50 వేల రూపాయల వంతున హ్యూమానిటీ కార్పస్ ఫండ్ చెక్కులను, ఇద్దరు హోం గార్డుల కుటుంబాలకు 9 లక్షల రూపాయల వంతున చెక్కులను అందించారు. అదనపు ఎస్పీలు శ్రీనివాసరావు, హిమవతి, చౌడేశ్వరి, కె.శ్రీలక్ష్మి, డిఎస్పీలు కోటారెడ్డి, హరినాథ్‌రెడ్డి, అబ్దుల్ సుభాన్, గాంధీ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు పాల్గొన్నారు.

## ఇస్రో శాస్త్రవేత్తలకు శ్రీసిటీ ఎం.డి అభినందనలు



అత్యంత శక్తివంతమైన రాకెట్ జిఎస్ఎల్వి మార్క్-3 (ఎల్వీఎం-3)ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) దిగ్విజయంగా ప్రయోగించడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వెలిబుచ్చారు. ఈ ప్రయోగం ద్వారా బ్రిటీష్ స్టార్టప్ వన్‌వెబ్ యొక్క 36 బ్రాడ్‌బ్యాండ్ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యల్లోకి పంపడంలో విజయం సాధించినందుకు ఇస్రో అధ్యక్షులు కె.సోమనాథ్‌కు, షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్ కు, షార్ శాస్త్రవేత్తలకు, ఇతర ఉద్యోగస్థులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) ఎల్వీఎం-3 యొక్క తొలి వాణిజ్య విజయం సాధించడం శ్లాఘనీయమని ఆయన పేర్కొన్నారు.









## దేవాదాయశాఖ ‘గ్రీవెన్స్’

అర్చకుల సమస్యలు తీర్చడానికి ఇకనుంచి ప్రతి సోమవారం దేవాదాయశాఖ గ్రీవెన్స్ ప్రారంభిస్తోంది. ఆ రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల దాకా అర్చకులు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని ఆ శాఖ సహాయ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జిల్లాలోని అర్చకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## శనగ విత్తనాలకు రాయితీ

శనగ విత్తనాలకు ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇచ్చిందని, అన్ని రైతుభరోసా కేంద్రాల్లో లభిస్తాయని కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం వ్యవసాయాధికారి హేమంత్‌భరత్‌కుమార్ తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఈనెల 31వ తేదీలోగా పేర్లు నమోదుచేసుకోవాలని, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు (జెరాక్స్ కాపీ) తీసుకురావాలని పేర్కొన్నారు.



# శ్రీసిటీలో జపాన్ ప్రతినిధుల బృందం

## - జిమ్ శిక్షణపై సమీక్ష, అభ్యర్థులకు సర్టిఫికెట్లు పంపిణీ -

జపాన్ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ట్రేడ్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ బ్యూరో ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం ఆ సంస్థ డైరెక్టర్ శ్రీమతి ఓట మినెకో నేతృత్వంలో అసోసియేషన్ ఫర్ ఓవర్సీస్ టెక్నికల్ కోఆపరేషన్ అండ్ సస్టైనబుల్ పార్టనర్‌షిప్స్ అధికారుల బృందంతో కలిసి ఈనెల 23న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, సాంకేతిక శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి సేవలందిస్తున్న జపాన్-ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ మ్యానుఫ్యాక్చరింగ్‌ను సమీక్షించడానికి శ్రీసిటీని సందర్శించినందుకు ఓట మినెకో, ఇతర ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ యువత జపనీస్ తయారీ సంస్కృతి వైపు దృష్టి సారించడంలో ఈ శిక్షణ సహాయపడుతుందన్నారు. ఈ ప్రక్రియలో ముఖ్యమైన భాగస్వామిగా ఉన్నందుకు తాము చాలా సంతోషిస్తున్నామన్నారు. శ్రీసిటీలోని ఐసాన్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ సకో, ఐమాస్ వెంకటేష్, ఇసుజు వెంకట కృష్ణ మాట్లాడుతూ, జిమ్‌లో అందిస్తున్న నైపుణ్య శిక్షణ గురించి వివరించారు. శిక్షణ పొందిన పూర్వ, ప్రస్తుత బ్యాచ్ విద్యార్థులతో ఓట మినెకో ప్రతినిధుల బృందం ఈ సందర్భంగా చర్చించారు. అనంతరం శిక్షణ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో) మరియు భారతదేశంలోని జపాన్ ఎంబసీ అధికారులు పాల్గొన్నారు.

## దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

# ఉచిత వైద్య శిబిరం



అల్లూరు మండలం నార్త్‌మోపూరు పరిధిలోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనేకమంది రోగులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు. తొలుత ఈ వైద్యశిబిరాన్ని ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తమ ట్రస్ట్ ద్వారా ప్రతినెలా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని, అల్లూరు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సేవా కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ప్రఖ్యాత గుండె వైద్య నిపుణులు డా. భక్తవత్సలరెడ్డి, ప్రముఖ ఫిజీషియన్ డా. ఎన్.ఆర్.సాయికుమార్, డా.ప్రవీణ్‌లు పాల్గొని దాదాపు 200 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, వైద్యశాల వైద్యులు రమేష్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌ఛార్జి రామచంద్రరావు, ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో.. ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్




దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో 75 వారాలపాటు నిర్వహించ తలపెట్టిన 'అజరామరమైన స్వేచ్ఛాస్వాతం త్ర్యాల సంబరం' కార్యక్రమంలో భాగంగా 3వ విడత ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ కార్యక్రమం కోట మండలంలోని విద్యానగర్ ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల ఉత్సాహంగా జరిగింది. 10-ఏ నావెల్ యూనిట్ ఎన్‌సిసి అధికారి డా. వి.మల్లికార్జునరెడ్డి, ఆర్మీ ఎన్‌సిసి అధికారి మాధవయ్య ఆధ్వర్యంలో దాదాపు వందమంది విద్యార్థులు 3 కిలోమీటర్ల పరుగులో పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# అట్టహాసంగా ఆదాల పుట్టినరోజు వేడుకలు

## శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ



నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఈనెల 25వ తేదీ మంగళవారం నెల్లూరులోని ఆయన నివాసంలో అట్టహాసంగా జరిగాయి. ప్రధాని మోడీ ఆదాల పుట్టినరోజున శుభాకాంక్షల గ్రీటింగ్ కార్డు పంపారు. శాంతి సౌభాగ్యాలతో, మంచి ఆరోగ్యంతో విలసిల్లాలని, ప్రజా జీవితంతో జాతి నిర్మాణానికి పటిష్టమైన పునాదివేయాలని ప్రధాని ఆకాంక్షించారు.

నెల్లూరుకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, వైకాపా కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, పెద్దసంఖ్యలో బంధు మిత్రులు ఆదాల నివాసానికి వచ్చి పుట్టినరోజు శుభకాంక్షలు చెప్పారు. దీంతో వారి నివాస ప్రాంగణమంతా కోలాహలం నెలకొంది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రూరల్ ఇన్‌ఛార్జి గిరిధర్‌రెడ్డి, 'నుడా' ఛైర్మన్ ముక్కాల ద్వారకనాథ్, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మాజీ జడ్పీటిసి చేజర్ల సుబ్బారెడ్డి, వైసీపీ సీనియర్ నేతలు వైవి రామిరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొని శాలువాలతో ఆదాలను సత్కరించి శుభా కాంక్షలు తెలిపారు.

### అంధుల పాఠశాలకు లక్ష విరాళం

నెల్లూరు ఎంపీ ఆదాల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అంధుల పాఠశాలకు ఆయన లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. విజయ డెయిరీ ఛైర్మెన్ రంగారెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తరఫున ఆ విరాళాన్ని పాఠశాల అధినేతకు అందజేశారు. ప్రతి ఏడాది తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఎంపీ ఆదాల ఈ విరాళాన్ని అందజేయడం ఆనవాయితీ.

### స్వర్ణ వెంకయ్య సన్మానం

నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అనుచరుడు స్వర్ణ వెంకయ్య ఎంపీ ఆదాలకు ఘన సన్మానం చేశారు. తప్పెట్లు, తాళాలతో, భారీ సంఖ్యలో అభిమానులతో బాణసంచా కాలుస్తూ కోలాహలం నింపారు. ఆదాలను గజమాలతో సత్కరించి, శాలువాతో సన్మానం చేశారు. భారీ కేకును కట్ చేయించి అందరికీ పంచారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో 350 మంది రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఆదాల మరో అనుచరుడు నవీన్ కుమార్ రెడ్డి భారీ సంఖ్యలో అభిమానులతో వచ్చి ఆదాలను గజమాలతో సన్మానించారు. కార్పొరేటర్ నూనె మల్లికార్జునయాదవ్ కిరీటం తొడిగి, భారీ గజమాలతో సన్మానించారు. మాజీ జడ్పీటిసి చేజర్ల సుబ్బారెడ్డి తదతరులు ఆదాల పుట్టినరోజును వేడుకగా నిర్వహించారు.

### అభిమానుల రక్తదానం

ఆదాల ప్రభాకర్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జిమ్ వంశీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో జరిగిన ఈ మెగా రక్తదాన శిబిరంలో పలువురు ఆదాల అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్పొరేటర్ నూనె మల్లికార్జునయాదవ్, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, కార్నేటి కోటేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



# దివ్యాంగులకు 'రెడ్' దుస్తులు

గూడూరు పట్టణంలోని వీరభద్రస్వామి దేవస్థానం నందు రిహేబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషన్ డిసేబుల్డ్(రెడ్) సంస్థ ఆధ్వ ర్యంలో సంస్థ గౌరవాధ్యక్షులు కోట సునీల్‌కుమార్ సమక్షంలో దీపావళి పండుగ సందర్భంగా 40 మంది దివ్యాంగులకు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణచక్రవర్తి చేతులమీదుగా కొత్త దుస్తులు, స్వీట్స్, టపాసులు అందజేశారు. ఈ సందర్భంగా బల్లి కళ్యాణ్ రెడ్ సంస్థకు స్వర్గీయ బల్లి దుర్గాప్రసాద్‌రావు జ్ఞాపకార్థం లక్ష రూపా యలు విరాళంగా అందజేసి మాట్లాడుతూ రెడ్ సంస్థ ఆశ్రమం ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు.

వేగూరు రాజేంద్రప్రసాద్, ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు సుప్రభా, కార్యదర్శి జీవని, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, కోడిపర్తి శ్రీధర్, రాజేష్, రామలింగం, శ్రీనివాసాచారి, పల్లం వెంకటేశ్వర్లు, జమీర్, రాజేంద్ర, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు

గూడూరు పట్టణంలోని త్యాగరాజవీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి ఇటీవల ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంక రించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూజలు వైభవంగా చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరించారు. పాక్షిక సూర్యగ్రహణం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాలను మూసివేశారు.



# పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిది

## - డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

దేశంలో శాంతి సామరస్యాలు నెలకొ ల్పేందుకు శత్రు మూకలపై జరిగిన కాల్పుల్లో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి అమరులైన ఎంతోమంది పోలీసు అధికారులు, సిబ్బంది త్యాగం మరువలేనిదని గూడూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు డీఎస్పీ ఆధ్వర్యంలో పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ముందుగా స్థానిక టవర్ క్లాక్ సెంటర్లో పట్టణ సీఐ హజరత్‌బాబు, రూరల్ సీఐ దశరథ రామారావు, రెండో పట్టణ సీఐ వెంకటరమణ, ఎస్సైలు బ్రహ్మ నాయుడు, గోపాల్‌లతో కలిసి డీఎస్పీ పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుండి కూరగాయల మార్కెట్ వరకు పోలీస్ అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు.

# గిరిజన కాలనీలో దీపావళి సంబరాలు



గూడూరు రూరల్ మండలం, పోటుపాలెం, శారదానగర్ లోని గిరిజన కాలనీలోని పిల్లలతో కలసి ఇన్నర్ వీల్, ఆంధ్ర మహిళా మండలి సభ్యులు ఘనంగా దీపావళిని జరుపుకున్నారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి సహకారంతో పిల్లలు టపాకాయలు కాల్చి కేరింతలు కొట్టారు. అనంతరం పిల్లలకు అల్పాహారం అందజేశారు. ఇన్నర్‌వీల్ అధ్యక్షు రాలు బద్రి సుప్రభ, కార్యదర్శి జీవనిరెడ్డి, ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన, సభ్యులు శశికళ, లక్ష్మి పాల్గొన్నారు.

• రాష్ట్రంలో

# రాహుల్‌యాత్ర..విజయవంతం



డిసిసి నేత చేవూరు

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ రాష్ట్రంలో చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' విజయవంతమైందని, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి యాత్రను స్వాగతించారని జిల్లా కాంగ్రెస్ నేత చేవూరు దేవకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ యాత్రకు జిల్లా నుంచి వెళ్లిన తమను, జిల్లా నాయకులను రాహుల్‌గాంధీ అభినందించారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో చేవూరు మాట్లాడుతూ నెల్లూరుజిల్లా నుంచి రాహుల్ యాత్రకు దాదాపు 3 వందల మందికిపైగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారని తెలిపారు. జిల్లా నాయకులను ఈ సందర్భంగా పరిచయం చేశామని, నాయకులందరినీ ఆయన అభినందించారని, అనంతరం తామంతా రాహుల్‌గాంధీతో పాదయాత్రలో పాల్గొన్నామని చెప్పారు. బీజేపీ పాలనలో దేశంలో జరుగుతున్న నిరంకుశపాలనను, రాష్ట్రంలో ప్రజలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న వైకాపా పాలనలను ఖండిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రైతులు పడుతున్న కష్టాలు స్వయంగా తెలుసుకుంటూ, దేశ స్వాతంత్ర్యం కోసం, దేశ ప్రజల అభివృద్ధి కోసం ఎన్నో త్యాగాలు చేసిన గాంధీ కుటుంబ వారసుడిగా రాహుల్ గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్ర దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందుతూ మరో చరిత్రాత్మక ఘట్టంగా ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని చేవూరు సంతోషం వ్యక్తం చేశారు. విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదాతో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిని అమరావతిలో ఏర్పాటుచేసేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ఇవన్నీ సాధించడం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్‌బాబు, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ప్రధానకార్యదర్శి చేవూరు శ్రీధర్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కొండా అనిల్‌కుమార్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పప్పర్తి గణేష్‌బాబు, పీసీసీ సభ్యులు చింతలబోయిన నరేష్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాగరాజు, యూత్ కాంగ్రెస్ సిటీ అధ్యక్షుడు నాగిరెడ్డి రాజేష్, కావలి టౌన్ మహిళా అధ్యక్షురాలు గుమ్మా మానస, వింజమూరు మండలాధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డిలను స్వయంగా రాహుల్‌గాంధీకి పరిచయం చేశామన్నారు.

## గ్రహణంతో.. ఆలయాల మూత

అక్టోబరు 25వ తేదీ మంగళవారం పాక్షిక సూర్యగ్రహణంతో జిల్లాలోని ఆలయాలు మూతపడ్డాయి. ఉదయం 8గంటల నుంచి ఆలయ అధికారులు, నిర్వాహకులు ఆలయాలను మూసివేశారు. గ్రహణం సాయంత్రం 5.04 గంటలకు ప్రారంభమై, 6.32 గంటలకు ముగిసింది. గ్రహణంతో పెంచలకోన ఆలయం, జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి దేవాలయం, నెల్లూరులోని శ్రీ రంగనాథాలయం, మూలస్థానేశ్వరాలయం, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, తదితర ఆలయాలన్నీ మూసివేశారు. గ్రహణం అనంతరం శాస్త్రోక్తంగా శుద్ధి, సంప్రోక్షణలుచేసి తిరిగి పూజలు చేశారు. బుధవారం ఉదయం యథావిధిగా ఆలయాలను తెరిచారు.

30న చెన్నైలో..

## 'వేద విజ్ఞాన వేదిక' కార్యక్రమం

చెన్నై, టి.నగర్‌లో ఉన్న ఆంధ్రాక్లబ్‌లో అక్టోబరు 30వ తేదీ ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు 'వేద విజ్ఞాన వేదిక' సాహితీ కార్యక్రమం జరుగుతుందని వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి డా.ప్రభల జానకి పాల్గొని 'కురువంశ కుల వధువులు ధర్మస్వరూపిణులు' అనే అంశంపై ఉపన్యసిస్తారని, సాహిత్యాభిమానులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.




# రైతులకు మేలు జరిగేలా చూడాలి

## వ్యవసాయ అధికారులను ఆదేశించిన మంత్రి కాకాణి

వ్యవసాయ సలహా మండలి సమావేశాలు మొక్కుబడిగా కాకుండా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు చర్చించుకుంటూ రైతులకు మేలు జరిగేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. ఈనెల 23న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది.

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా జిల్లాలో వ్యవసాయ పనిముట్ల మంజూరుకు సంబంధించిన సబ్సిడీని త్వరలోనే విడుదల చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రతి రైతుభరోసా కేంద్రంలో అదనంగా ఒక వ్యవసాయ శాఖ ఉద్యోగిని నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ, 2022-23 ఖరీఫ్ సాగుకు సంబంధించి అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇంకా రైతులకు ధాన్యం నగదు చెల్లించాల్సివుందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరగా రైతులకు ధాన్యం నగదు బకాయిలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల శాఖలో జరిగిన అవినీతిపై సమగ్రంగా విచారణ చేపట్టి రైతులకు రావాల్సిన రవాణా ఛార్జీలు, హమాలీ ఛార్జీలు త్వరగా చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియ పటిష్టంగా జరుగుతోందని ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. కందుకూరు శాసన సభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని గ్రామ, మండల స్థాయిలో వ్యవసాయ సలహా మండలి సమావేశాలు నిర్వహించాలన్నారు. రైతులు కోరుతున్న విత్తనాలను, ఎరువులను ఆర్‌బికెలలో రైతులకు అందుబాటులో వుంచాలన్నారు. సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను వ్యక్తిగతంగా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్‌రాజు తదితర అధికారులతో పాటు రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అవధానానికి ధ్యానం.. అధ్యయనం ముఖ్యం

----- అమెరికాలో డా. మేడసాని మోహన్ -----



అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో ఈనెల 22న 'బే ఏరియా తెలుగు సంఘం' (బాటా) స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అవధాన సామ్రాట్, సరస్వతీ సత్పుత్ర డా. మేడసాని మోహన్ అష్టావధానం అందరినీ బాగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవధానిగా రాణించేందుకు ధ్యానం..అధ్యయనం ముఖ్యమని అన్నారు. భగవంతుని కృపతో అవి తనకు లభించడం పూర్వజన్మ సుకృతమని తెలిపారు. తెలుగువారు ప్రపంచంలో ఎక్కడున్నా తెలుగుతల్లిని విస్మరించకుండా తెలుగు వైభవాన్ని చాటుతూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుండడం హర్షదాయకమంటూ ఆ కార్యక్రమం నిర్వాహకులను ఆయన అభినందించారు. అష్టావధానానికి పొలదుగు శ్రీచరణ్ సమన్వయకర్తగా వ్యవహరించగా, పృచ్ఛకులుగా మారేపల్లి నాగవేంకటశాస్త్రి, తల్లాప్రగడ రామచంద్రరావు, డాక్టర్ కె.గీతామాధవి, పుల్లెల శ్యామసుందర్, మాజేటి సుమలత, పిల్లలమర్రి కృష్ణకుమార్, ఆచంట స్వాతి, మధుబాబు పాల్గొన్నారు. అనంతరం డా. మేడసాని మోహన్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

## విఎస్‌యు వీసీ పుట్టినరోజున.. వృద్ధులకు పండ్లు పంపిణీ

నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీ వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 25న పరిశోధక విద్యార్థులు, పలువురు అధ్యాపకులు బివినగర్‌లోని జనని కేర్‌హోమ్‌లో ఉన్న వృద్ధులకు పండ్లు పంపిణీచేశారు. విఎస్‌యు రిజిస్ట్రార్ పి.రామచంద్రారెడ్డి, ఆచార్య సుజా ఎస్ నాయర్, ఆర్.మధుమతి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఉదయ్‌శంకర్, వి.సుబ్బారెడ్డి, మణికంఠ పాల్గొన్నారు.

## టూకీగా...



### నెల్లూరు రంగనాథునికి దీపావళి పూజలు

నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో ఇటీవల దీపావళి పూజలు వైభవంగా నిర్వహించారు. నరకచతుర్దశి రోజున గోపురోత్సవం నిర్వహించి, నరకాసుర వధ కార్యక్రమాలు చేశారు. దీపావళి నాడు స్వామివారికి తిరుమంజనం, పేట ఉత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### మర్రిపాడులో 'చుక్కల భూముల'పై సమీక్ష

మండల కేంద్రమైన మర్రిపాడులో ఇటీవల 'చుక్కల భూముల' సమస్యలపై తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ ఎంవి సుధాకర్ సమీక్ష నిర్వహించారు. రెవిన్యూ గ్రామాలవారీగా విఆర్‌ఓలతో మాట్లాడి ఆ సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తెలుగుగంగ డెప్యూటీ కలెక్టర్ సువర్ణమ్మ, తహశీల్దారు హేమంత్‌కుమార్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో ఆర్‌జేడీ.. రికార్డుల పరిశీలన

ఇందుకూరుపేట మండలంలోని దేవిస్‌పేట ప్రాథమిక పాఠశాలలోను, ముదివర్తిపాళెం జడ్పీ పాఠశాలలోను విద్యా శాఖ ఆర్‌జేడీ వి.సుబ్బారావు ఇటీవల రికార్డులు పరిశీలించారు. 'నాడు-నేడు' పనుల పురోగతికి ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఎంఇఓ శ్రీహరి పాల్గొన్నారు.

### కలువాయి అచ్యుతస్వామికి లక్ష విరాళం

మండల కేంద్రమైన కలువాయిలో శ్రీ అచ్యుతస్వామి దేవాలయానికి అంధె చిన్నప్పశెట్టి ట్రస్టు ద్వారా ఆ ట్రస్ట్‌కు చెందిన డిసి రాజారావు, ఎన్.పరంధామయ్య, లక్కాకుల ఆనందరావు కలసి ఇటీవల లక్ష రూపాయల విరాళం అందజేశారు. పెంచలకోన దేవస్థానానికి దత్తత ఆలయమైన అచ్యుత స్వామి ఆలయ నిర్వహణ కోసం ఈ విరాళం అందజేశామని చెప్పారు.

### కోవూరుపల్లిలో క్లీన్ అండ్ గ్రీన్

'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమంలో భాగంగా ఇటీవల బోగోలు మండలం కడనూతల గ్రామంలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య ప్రాంతంలోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ పి.వీరనారాయణరెడ్డి, డైరెక్టర్ కె.రాజారెడ్డి, డాక్టర్ బి.ప్రవీణ్ కుమార్, సమన్వయకర్త కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గిద్దలూరులో 'ఈ-క్రాప్'పై అవగాహన

సైదాపురం మండలంలోని గిద్దలూరు గ్రామంలో ఇటీవల మండల వ్యవసాయాధికారి హైమవతి రైతులకు 'ఈ-క్రాప్' నమోదుపై అవగాహన కలిగించారు. పంటలు వేసుకున్న ప్రతిరైతు ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ-క్రాప్ నమోదు తప్పనిసరని తెలిపారు. అనంతరం రైతులతో కలసి ఈ రబీ సీజన్ పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు.

### పోలీసులకు పండ్లు పంపిణీ

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరులో ట్రాఫిక్ నిర్వహిస్తున్న పోలీసులకు సామాజిక కార్యకర్త, బహుజన ప్రజాసంఘం ఎస్సీఎస్టీబీసీ మైనార్టీల అభివృద్ధి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణయ్య పండ్లు పంపిణీ చేశారు. శాంతిభద్రతలను పర్యవేక్షించే పోలీసుల సేవలు అమోఘమన్నారు. తొలుత, పోలీసు అమరవీరులకు ఆయన ఘన నివాళులర్పించారు.

### కోవూరు హాస్టల్‌లో ఏఎస్‌డబ్ల్యు తనిఖీ

హాస్టల్ బాలికలకు భోజనం సరిగా పెడుతున్నారా లేదా అని ఏఎస్‌డబ్ల్యు మనోజ్ ఇటీవల కోవూరులోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లో తనిఖీలు చేశారు. మెనూను పరిశీలించారు. వసతులు, భోజనం ఎలా ఉంటున్నాయో బాలికలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు.

# భగవద్గీత సాక్షిగా.. ఫలించిన కృషి

# బ్రిటన్ పీఠంపై.. భారత 'రిషి'

*ఒకప్పుడు బ్రిటన్ అంటే రవి అస్తమించని సామ్రాజ్యం. ప్రపంచాన్నే గడగడలాడించిన దేశమది. దాదాపు రెండువందల సంవత్సరాల పాటు మనదేశాన్ని ఏలుతూ, చెప్పలేనన్ని అమానుషాలకు, లెక్కలేనన్ని అరాచకాలకు తెగబడి, లక్షలాదిమందిని హింసించి ప్రాణాలు తీసిన నాటి బ్రిటీష్ నిరంకుశ పాలకుల దృష్టిలో భారత్ అంటే ఒక బానిసదేశం. భారతీయులంటే వారికి గడ్డిపరకలతో సమానం. భారతనాయకులంటే ఉత్త అసమర్ధులనే భావం. మహాత్మాగాంధీ, నెహ్రూజీ, నేతాజీ, లాలాలజపతిరాయ్ వంటి అపూర్వమైన నేతలు, రాణీ ఝాన్సీభాయ్, భగత్‌సింగ్, రాణాప్రతాప్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి మహావీరులున్న మనదేశంలో..నాయకులన్నవారిని సైతం ఎన్నెన్ని హింసలకు, అవమానాలకు గురిచేశారో, చెరసాలల్లో బంధించి ఉరికొయ్యలు తగిలించి ఎంతమంది వీరుల ఉసురు పోసుకున్నారో లెక్కే లేదు. ఈ దేశాన్ని తమ ఇనుపబూట్ల కింద ఎంత కర్కశంగా అణగదొక్కారో, పెద్దపెద్ద జమీందారుల్ని, మహారాజుల్ని, అమాయక ప్రజల్ని సైతం కుక్కలకంటే ఘోరంగా కాల్చిపారేసి, ఎన్నెన్ని రక్తపాతాలు సృష్టించారో!.. ఎంత సంపద దోచుకుపోయారో!.. ఎన్ని కోట్లమంది వారి దౌష్ట్యాలకు అల్లాడిపోయారో చెప్పలేం. దేశాన్నంతా సర్వనాశనం చేశారు..స్మశానం చేశారు. ప్రత్యేకించి హిందువులను, హిందూమతాన్ని దూషిస్తూ ఎగతాళి చేశారు. కఠినత్వానికి, కర్కశత్వానికి మారుపేరుగా ఉన్న ఆ పాషాణ నియంతల కబంధహస్తాల నుంచి దేశాన్ని కాపాడుకోవడం కోసం.. స్వాతంత్ర్య సముపార్జన కోసం ఎన్ని కోట్లమంది తమ ప్రాణాలను బలిదానం చేశారో!.. ఎన్నెన్ని త్యాగాలు చేశారో..ఎన్నని చెప్పగలం.ఏమని చెప్పగలం!..ఇదంతా గతం. తలచుకుంటేనే కంటికి కడివెడు కన్నీళ్ళు.. గుండెలంతా ఆరని నెగళ్ళు!..అస్తమించని సూర్యుడొక్కడే వీటన్నిటికీ ప్రత్యక్షసాక్షి. విశ్వశాంతిని ఆకాక్షించే పవిత్ర భారతమాత అన్నిటినీ ఉగ్గబట్టి నిభాయించింది. అవన్నీ గతచరిత్రలోనే ఇంకిపోయాయి. ఒకటా రెండా.. 75 ఏళ్ళు గడిచిపోయాయి. ఇంతకాలానికి..కాలమే ఒక్కసారిగా తిరగబడింది. ఒకప్పుడు ప్రపంచాన్నే వణికించిన బ్రిటన్ ఆర్థికస్థితి అల్లకల్లోలమైపోయి ఆ దేశమంతా ఇప్పుడు గజగజ వణికిపోతోంది. ఎప్పుడూ లేని గడ్డుకాలం ఏర్పడింది. ఇంతటి ఆపదలో దేశాన్ని గట్టెక్కించే నాధులెవరా అని ఆక్రోశించింది. చివరికి.. ఏ దేశాన్నయితే పరమనీచంగా, హీనంగా చూశారో.. ఏ దేశాన్నయితే వారు అత్యంత అసమర్ధదేశంగా భావించారో.. ఆ భారతదేశం మూలాలున్న వ్యక్తినే సమర్ధునిగా ఎంచుకోవడం విశేషం. అంతా కాలమహిమ. అందులోనూ గుడులు గోపురాలు తిరుగుతూ, చేతికి రక్షరేఖలు కట్టుకుని తానొక హిందువునని సగర్వంగా చెప్పుకునే నేతనే..బ్రిటిష్ పార్లమెంట్‌లో భగవద్గీతపై ప్రమాణం చేసిన నాయకుడినే..దేశంలోని అత్యున్నతమైన ప్రధాని పదవికి రెండుచేతులెత్తి ఆహ్వానించడం..రిషి ప్రతిభాపాటవాలకి నిదర్శనం. ఏదేమైనా, భారత్‌ను ఏళ్ళ తరబడి పాలించిన బ్రిటిష్ పీఠంపై.. ఒక భారతీయ 'రిషి'.. ప్రధాని పదవిని అధిష్టించిన దృశ్యం.. అపూర్వం!.. భారత సంతతికి చెందిన వ్యక్తి.. ఇప్పుడు బ్రిటిష్‌కు తొలి హిందూ ప్రధానిగా పీఠం అధిష్టించడం ప్రపంచచరిత్రలోనే ఒక చరిత్రాత్మక ఘట్టం! ఈ శతాబ్దంలోనే కాదు.. ఈ యుగంలోనే ఇదొక అద్భుతం!..ప్రత్యేకించి..భారతదేశానికిది గర్వకారణం!*



### ఇన్ఫోసిస్ నారాయణమూర్తి అల్లుడే.. మన రిషి

ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ సంస్థ 'ఇన్ఫోసిస్' వ్యవస్థాపకులైన నారాయణమూర్తి – సుధానారాయణమూర్తిల అల్లుడే.. మన రిషి సునాక్. వారి కుమార్తె అక్షతను రిషి వివాహం చేసుకున్నారు. 2009 ఆగస్టులో బెంగుళూరులో వీరి కల్యాణం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు. తన ఇద్దరు కుమార్తెలకు కూడా భారతీయత స్ఫురించేలా కృష్ణ, అనుష్క అని పేర్లు పెట్టారు. భారత్ అంటే ఆయనకు అభిమానం. భారత్‌లోనే ఆయన వివాహం చేసుకున్నారు. ప్రత్యేకించి హిందూ సంప్రదాయాలంటే రిషికి ఎనలేని గౌరవం. 'భారతీయ' రిషి..బ్రిటన్ ప్రధాని కావడంతో బ్రిటన్ ప్రజలతో పాటు.. భారతీయులు కూడా ఎంతో సంతోషిస్తున్నారు.

### 'రిషి' సునాక్!...

ఇప్పుడు ప్రపంచమంతా మారుమోగిపోతున్న పేరు ఇది. బ్రిటన్ ప్రధానిగా ఏకగ్రీవంగా ఎన్నికైన తొలి భారత సంతతి నేతగా.. చరిత్ర సృష్టించిన పేరు. బళ్ళు ఓడలవుతాయి.. ఓడలు బళ్ళవుతాయన్న సామెతగా, అప్పట్లో వారికి బానిస దేశంగా కన్పించిన భారతదేశం ఇప్పుడు అన్నిరంగాల్లో ముందుకు దూసుకుపోతుంటే, ఒకప్పట్లో వాణిజ్యరంగంలో తన కెదురేలేదని తిరుగులేని వ్యాపార సామ్రాజ్యంగా ఉన్న బ్రిటన్..ఇప్పుడు ఆర్థిక సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది.

ఈ దుస్థితిలో దేశాన్ని ఉద్ధరిస్తానంటూ ఇటీవలే ఎన్నికైన లిజ్‌ట్రస్ కేవలం 45 రోజులకే పదవి నుంచి తప్పు కోవడంతో, భారతీయ సంతతికి చెందిన రిషి సునాక్ ఆ పదవికి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం, హిందూమతానికి చెందిన రిషి ప్రధాని కావడం చరిత్రాత్మకం. అంతే కాదు, 210 ఏళ్ళ బ్రిటిష్ చరిత్రలోనే అత్యంత పిన్న వయస్కుడు ప్రధాని పదవి చేపట్టడం కూడా ఇదే. బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో బ్రిటన్ రాజు చార్లెస్–3 రిషిని బ్రిటన్ ప్రధానిగా ప్రకటించారు.

బ్రిటిష్ కన్జర్వేటివ్ పార్టీ అధినేతగా, సగర్వంగా రిషి.. అక్టోబరు 25న బ్రిటన్ ప్రధాని పదవిని చేపట్టారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడమే తన ప్రధాన లక్ష్యమంటూ ముందుకు సాగుతున్నారు రిషి!.

### అసాధారణ ప్రతిభే.. అందలమెక్కించింది

అసాధారణ రాజకీయ ప్రతిభే రిషిని అందలమెక్కించింది. ఇంగ్లండ్‌లోని సౌథాంప్టన్‌లో పుట్టి, వించెస్టర్ పాఠశాలలో చదువుకున్నారాయన. విద్యార్థి దశలో అమ్మతో పాటు మందుల దుకాణంలో సహాయంగా ఉండేవారు. సెలవురోజుల్లో భారతీయ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా కూడా పనిచేశారు. తొలినుంచి కష్టం తెలిసిన మనిషి. వొళ్ళొంచి పనిచేసే తత్వం. అందుకే ఆయనందరికీ గౌరవపాత్రులయ్యారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్‌లో డిగ్రీ చదువుకుని, స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఎంబిఏ చేశారు. ఇక్కడే 'ఇన్ఫోసిస్' వ్యవస్థాపకులు నారాయణమూర్తి కుమార్తె అక్షతతో పరిచయం, ఆ తర్వాత ఆమెతో 2009లో పరిణయం జరిగాయి.

### బ్రిటిష్ పార్లమెంట్‌లో భగవద్గీతపై ప్రమాణం

2015లో రిచ్‌మండ్ నుంచి రిషి సునాక్ ఎంపీగా గెలుపొందినప్పటినుంచి దేశరాజకీయాల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. తొలిసారిగా ఆయన ఎంపీగా ఎన్నికైనప్పుడు బ్రిటిష్ పార్లమెంట్‌లో సాక్షాత్తూ 'భగవద్గీత సాక్షిగా' బ్రిటిష్ పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేసి తనకు భగవద్గీతపై ఎంత భక్తి ఉందో చెప్పకనే చెప్పారు. ఆ తర్వాత, 2018లో తొలిసారిగా మంత్రి కూడా అయ్యారు. అందరూ విలాసాలు పోతుంటే, రిషి మాత్రం ఒక రుషిలాగనే ప్రత్యేకంగా ఉండేవారు. తన మతమేమో తనది..అన్నట్లుగా ఆలయాల్లో ప్రదక్షిణలు చేస్తూ, గోమాతలకు ఆహారం తినిపిస్తూ సంతృప్తి చెందేవారు. అందరూ విలాసాల్లో ఉంటే రిషి అందుకు విభిన్నంగా హిందూ సంప్రదాయ పద్ధతిలో దీపావళి పండుగ చేసుకునేవారు. బ్రిటన్‌లో సాధారణంగా మద్యం లేకుండా రోజు జరగదు..అలాంటిది మద్యం అనేమాట లేకుండానే, దాని జోలికి పోకుండానే బ్రిటన్‌లో ఆయన ఆదర్శవంతంగా జీవించడం అందరినీ ముగ్ధులను చేసేది. బ్రిటన్‌లోని గొప్ప ధనవంతుల్లో తామూ ఒకరైనా, రిషి దంపతులిద్దరూ అత్యంత నిరాడంబరంగానే జీవించేవారు. ఆ తర్వాత రిషి.. 2020లో ఆర్థికమంత్రిగా కూడా బాగా రాణించారు. ఈనెలలోనే (అక్టోబరు) ప్రధానిగా ఎన్నికల్లో నిలిచి గెలిచారు.


### సామాన్యుడే.. కానీ అసామాన్యుడు

సామాన్యునిగా పుట్టినా.. అసామాన్యునిగా ఎదిగారు రిషి సునాక్. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా..బ్రిటిష్ ప్రధానిగా అన్ని దేశాల ప్రజలు, నేతల అభినందనలు అందుకుంటున్నారు.

రిషి సునాక్.. పుట్టింది మధ్యతరగతి కుటుంబంలో. యునైటెడ్ కింగ్‌డంలోని సౌథాంప్టన్‌లో 1980 మే 12న ఆయన జన్మించారు. ఆయన తాత గారు భారతీయుడు. అప్పటి అఖండ భారతదేశం, ప్రస్తుత పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రాంతం వారిది. రిషి తల్లితండ్రులు 1960 ప్రాంతంలో కైరో నుంచి బ్రిటన్‌కు వలస వెళ్ళారు. రిషి తండ్రి యశ్‌వీర్ వైద్యులు. తల్లి ఉషా సునాక్ ఓ ఫార్మసిస్టు. రిషికి ఒక తమ్ముడు, చెల్లెలు కూడా ఉన్నారు. బ్రిటన్‌లో పుట్టి, బ్రిటన్‌లో ఎదిగి, బ్రిటన్ కోసం సర్వశక్తులూ ఒడ్డి తమ దేశాన్ని ఆర్థికసంక్షోభం నుంచి గట్టెక్కించడానికి ప్రతినబూనిన రిషి జీవిత ప్రస్థానం.. అనితరసాధ్యం.. అనన్య సామాన్యం. రిషి సారధ్యంలో బ్రిటన్ అన్నిరకాల సంక్షోభాల నుంచి తప్పకుండా బయటపడుతుందని బ్రిటన్ ప్రజలంతా గట్టిగా విశ్వసిస్తున్నారంటే, రిషి మీదున్న నమ్మకం అలాంటిది. ఆయన పాలనాదక్షత, నిరాడంబరత, చిత్తశుద్ధి అలాంటివి. అందరి సహకారంతో తాను ఆ లక్ష్యాన్ని సాధిసానని రిషి ప్రధానిగా.. ప్రజలకు భరోసా ఇచ్చారు కూడా. అమెరికా, భారత్‌తో పాటు ప్రపంచ దేశాలన్నీ రిషి బ్రిటన్ ప్రధాని కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రిషిని అభినందిస్తున్నాయి.

## అల్లూరులో.. అల్లంపాటి కాంస్య విగ్రహం

అల్లూరులోని రామకృష్ణా విద్యాసంస్థల అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త, స్వర్గీయ అల్లంపాటి విజయవర్ధన్‌రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ అక్టోబరు 26న ఘనంగా జరిగింది. రామకృష్ణా జూనియర్ కళాశాల ప్రాంగణంలో విగ్రహం ఏర్పాటుచేసి, కళాశాల కరెస్పాండెంట్‌గా ఆయన చేసిన సేవలను అందరూ కొనియాడారు. కళాశాలను దశలవారీగా ఎంతో అభివృద్ధిలోకి తెచ్చి, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు విద్యనందించేందుకు విజయవర్ధన్‌రెడ్డి చేసిన కృషి అపారమని వక్తలు ప్రశంసించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రముఖులను సన్మానించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి..టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు



సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, డిఎస్ఆర్ ట్రస్ట్ ఛైర్మెన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కావలి ఏఎంసి ఛైర్మెన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, అల్లంపాటి లోకేష్‌రెడ్డి, పుచ్చలపల్లి మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు పెద్దఎత్తున అన్నదానం చేశారు.

## 7న.. కార్తీక మహాదీపోత్సవం

- **శ్రీ పరిపూర్ణానందస్వామి, గరికపాటిలచే ప్రారంభోత్సవం**

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరులో సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో ఎంతో వేడుకగా జరుగనున్న కార్యక్రమాల్లో ప్రముఖ స్వామీజీలు పాల్గొననున్నారని ఈనెల 26న జరిగిన సమావేశంలో ఆ సమితి నిర్వాహకులు తెలిపారు. నవంబరు 7వ తేదిన నెల్లూరులోని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సమీపంలో చెరువుగట్టున ఉన్న గణేష్‌ఘాట్ వద్ద కార్తీక మహా దీపోత్సవం జరుగుతుందని, ఆ రోజున సాయంత్రం 6 గంటలకు శ్రీపీఠం వ్యవస్థాపకులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ పరిపూర్ణానంద స్వామీజీ, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు గరికపాటి నరసింహారావు పాల్గొని దీపోత్సవాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు వెన్నెల, ప్రధాన కార్యదర్శులు రాజేశ్వరి, మల్లిక, కార్యనిర్వాహక కార్యదర్శి వ్యాసప్రసాద్, కోశాధికారి మోహన్‌రావు, వాసు, రమణయ్య, రమేష్‌కుమార్ ఆచారి, వెంకటేష్ పాల్గొన్నారు.

# ‘వారి’భారం చంద్రబాబుదే!

**2024,** లేదా ఆ లోపు వస్తాయి అనుకుంటున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సమాయత్తమయ్యే క్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అనేక కోణాల్లో తీవ్ర ఒత్తిళ్లకు లోను కావలసిన పరిస్థితులే కనిపిస్తున్నాయి.

జనసేన, బీజేపీ, కమ్యూనిస్టులు... వగైరా అందరూ టీడీపీకి 2019లో వ్యతిరేకం. ఇప్పుడు, జగన్‌కు వ్యతిరేకంగా అన్ని పక్షాలూ ఒక్క తాటి మీదకు రావాలని చంద్రబాబు పిలుపు ఇచ్చారు. ఇవ్వడమే గాకుండా.. ఆ దిశగా ఆయన కృషి కూడా చేస్తున్నారు. చంద్రబాబు పిలుపును ప్రతిపక్షాల కంటే వైసీపీయే ముందుగా అందుకున్నట్టు కనబడుతోంది.

ఊగిసలాటలో ఉన్న పవన్ కళ్యాణ్‌ను తీసుకెళ్లి చంద్రబాబుకు వైసీపీ నేతలు అటాచ్ చేశారు. సీపీఐ ఏమో ఇప్పటికే టీడీపీతో కలిసి ప్రయాణిస్తోంది. (సీపీఎంలో అలికిడి లేదు). ఈ రెండూ పొత్తు దాకా వెడతాయనే  ఆశాభావం టీడీపీ అనుకూల వర్గాల్లో గట్టిగానే ఉంది. జనసేన క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల్లో కూడా జనసేన టీడీపీతో వెళ్లాలనే కోరిక బలంగానే ఉంది. కానీ, అవతల ఉన్నది పవన్ కళ్యాణ్ – నాగబాబు కాంబినేషన్ గనుక ఇందుకు చాలా షరతులు వర్తిస్తాయి. వీరితో పాటు, జై భీమ్ పార్టీని ఇటీవలే స్థాపించిన హైకోర్టు న్యాయవాది శ్రవణ్‌కుమార్ కూడా టీడీపీతో ఒక రౌండ్ మాట్టాడి వచ్చారు. తాను కూడా చంద్రబాబు పిలుపుకు స్పందించే ఆయనను కలిసి వచ్చినట్టు చెప్పారు.

వీరుగాక, ‘కాపు ఉద్యమం’లో తొలి నుంచీ కీలకపాత్ర పోషిస్తూ వస్తున్న భీమవరం న్యాయవాది ఆరేటి ప్రకాష్ ఒక కాపు పార్టీకి శ్రీకారం చుట్టే పనిలో సన్నిహితులతో సంప్రదింపులు జరుపుతున్నారు. కడుపులో నీళ్లు కదలకుండా ఇంటిపట్టున కాలక్షేపం చేస్తున్న మాజీమంత్రి ముద్రగడ పద్మనాభంను రోడ్డు ఎక్కించింది కూడా ఆరేటి ప్రకాషే. ఇటీవలనే పలువురు ప్రముఖ కాపు నేతలను హైదరాబాద్‌లోను, విజయవాడలోనూ ఒక చోటుకు చేర్చి మూడు నాలుగుసార్లు మంతనాలు కూడా జరిపించారు. కానీ, ఎవరికి వారు జారిపోవడంతో కాపు సామాజికవర్గం సంక్షేమం ధ్యేయంగా ఒక రాజకీయ పార్టీ దిశగా తన సన్నిహితులతో చర్చలు జరుపుతున్నారు. భీమవరంకు చెందిన టీడీపీ మాజీ ఎంపీ, కీర్తిశేషులు మెంటే పద్మనాభం అల్లుడు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా కాపు ప్రముఖులందరితో ఆయనకు ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయి. కాపు సంక్షేమానికి టీడీపీ, వైసీపీల్లో ఎవరు హామీ ఇస్తే, ఆ పార్టీ తరఫున కాపులలో ప్రచారం చేయాలనే ఆలోచనలో ఆరేటి ప్రకాష్ ఉన్నారు. ఆయన ఆలోచన చంద్రబాబు పిలుపును అందిపుచ్చుకునే దాకా ఇంకా రాలేదు.

ఇక బీజేపీ విషయమే తేలాల్సిఉంది. వారి రాష్ట్ర నాయకులకేమో టీడీపీతో వెళ్లడం ఇష్టంలేదు. అవతల మంచి సంబంధాలు ఉండడం ఓ కారణం కావచ్చు. జనసేనను కూడా తమతో కలుపుకు వెళ్లాలని తాపత్రయం పడుతున్నారు. అయితే బీజేపీనే తనతో కలుపుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. చివరకు ఏం జరుగుతుందో చూడాలి!

తమతో పొత్తు ఉందని చెప్పుకునే జనసేనేమో టీడీపీతో పొత్తు దిశగా అడుగులు వేయడం రాష్ట్ర బీజేపీ నేతలకు నచ్చడం లేదని చెబుతున్నారు. అందుకని, తాము జనసేనతో మాత్రమే పొత్తులో ఉన్నామని బీజేపీ నేతలు అడిగినవారికి, అడగని వారికీ చెబుతున్నారు. ఇది ఎలా సాధ్యమో తెలియదు. రాష్టంలో బీజేపీకి రెండు శాతం ఓట్లు కూడా లేకపోయినప్పటికీ దానిని టీడీపీ విస్మరించే పరిస్థితి లేదు. కేంద్రంలో అధికారంలో ఉండడం, ‘మోడీ దెబ్బ’ను ఒకసారి రుచి చూసి ఉండడంతో, దానిని కలుపుకు వెళ్ళడానికే చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తారనడంలో అనుమానం లేదు. బీజేపీతో పెద్దగా ఉపకారం లేకపోయినప్పటికీ అపకారం లేకుండా ఉంటే, అదే పదివేలు అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. ఏం జరుగుతుందనేది ఇప్పటికిప్పుడే స్పష్టమయ్యే వాతావరణం లేదు.

బీజేపీకి శాసనసభలో సీట్ల కంటే, లోక్‌సభలో సీట్లు ముఖ్యం. చంద్రబాబుకేమో లోకసభలో సీట్ల కంటే, శాసనసభలో సీట్లు ముఖ్యం. ఈ కోణంలో టీడీపీకి – బీజేపీకి ఢిల్లీ స్థాయిలో సయోధ్య కుదరవచ్చు అంటున్నారు. అయితే, ఈ విషయాలు తేలడానికి ఇంకా ఒక ఏడాదికిపైగా సమయం ఉంది. అప్పటిలోగా రాష్ట్రంలో చాలా సంచలన రాజకీయ ఘటనలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. వాటి కోసమే రాష్ట్ర రాజకీయాలు ఎదురు చూస్తున్నాయి. అందువల్లనే ఎవరూ ఏ విషయంలోనూ కమిట్ కావడం లేదు. ప్రజల కోసమే జనసేన అధికారంలోకి రావాలని అనుకుంటుందని పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు ప్రకటించారు. ‘జనసేన కూటమి’ అని మాట మాత్రంగా కూడా ఆయన అనలేదు. అలాగే, ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలుగుదేశం అధికారంలోకి రావడం ఖాయమని చంద్రబాబునాయుడు పేర్కొంటున్నారు గానీ ‘తెలుగుదేశం కూటమి’ అనే మాటను ఆయన కూడా వాడడం లేదు. ఎన్నికలకు చాలా సమయం ఉన్నందున, ఇప్పటి నుంచే... ‘కూటమి’ మాటలు ఎందుకు అని అనుకుంటున్నారేమో తెలియదు.

ఏతా... వాతా ఈ కూటమి అంటూ ఒకటి రూపుదిద్దుకుంటే రాష్ట్రంలోని 175 స్థానాలలో,





‘మిత్ర’పక్షాలకు ఎన్ని సీట్లు వదలాలి... ఏయే సీట్లు వదలాలి... అనేది ఒక పట్టాన తేలే విషయం కాదు. చర్చలు... సాగతీతలు... కూడికలు... తీసివేతలు... బుజ్జగింపులు... అలగడాలు.... బెదిరింపులు... నాగబాబు హెచ్చరికల తలపోట్లు  చంద్రబాబుకు తప్పకపోవచ్చు.

ఈ దశ దాటితే... తరువాత వచ్చే సమస్య ఎన్నికల ఖర్చు!

ఓటర్లలో ఈసారి అంచనాలు భారీగా పెరిగాయి. రాజకీయాలపై గౌరవం బాగా తగ్గడం ఒక ముఖ్య కారణం.

“నువ్వు దొంగ అంటే... నువ్వు దొంగ” అని, “నువ్వు లత్తుకోర్ అంటే... నువ్వు బాడ్కోవ్ అని, నువ్వు ఇన్ని కోట్లు తిన్నావ్ అంటే.... నువ్వు అన్ని కోట్లు తిన్నావ్ అని, నువ్వు బోకు అంటే.... నువ్వు పోరంబోకు” అని అధికార, ప్రతిపక్షాల నేతలు రోడ్డునపడి మరీ తిట్టుకుంటూ ఉండడంతో మన నేతలు ఒకరి జీవిత విశేషాలను మరొకరు తమ దృష్టికి తీసుకొస్తున్నారని ఓటర్లు భావిస్తున్నారు. అటువంటి వారికి ఓట్లు ఉచితంగా ఎందుకు వేయాలనే వారి లాజిక్‌ను కాదనడం కష్టం. పైపెచ్చు, ఒకసారి గెలిస్తే, నాయకులు ఇక చేతికి దొరకరనే భావం ఓటర్లలో బలంగా పాతుకు పోయింది. దాంతో, ఓటుకి రేటు బాగా... బాగా పెరిగిపోయిందని అంటున్నారు.

దీనిని పరిగణనలోకి తీసుకుంటే, ఒక్కో నియోజకవర్గానికి ఖర్చు ఇరవై, పాతిక కోట్లకు తక్కువ ఉండకపోవచ్చు (ఎన్నికల కమిషన్‌కు మాత్రం ఖర్చును ముప్ఫయి లక్షల ఎనభై వేల లోపు చూపించాలి. అందుకు ఒక్క రూపాయి ఎక్కువ చూపించినా ఎన్నిక రద్దు అవుతుంది).



టీడీపీ అభ్యర్థులతో పాటే, ‘మిత్ర’ పక్షాల అభ్యర్థుల ‘విషయం’ కూడా చంద్రబాబే చూడాల్సిరావచ్చు. మరి, నారు పోసిన వారే నీరు కూడా పోయాలి కదా!

ఏ రాజకీయ పార్టీ వెనకాల ఎగరేసుకుంటూ తిరిగే ‘కార్యకర్తలు, అభిమానులు, ఫాన్స్’ అయినాసరే... ‘అక్కడికి’ వచ్చేసరికి ‘తమ్ముడు తమ్ముడే.... పేకాట పేకాటే...’  అంటూ చేతులు చాచే అవకాశం లేకపోలేదు.

‘ధనం మూలం...మిదం జగత్...’ అన్నారు కదా పెద్దలు.

‘మా దగ్గర డబ్బుల్లేవ్...’ అంటూ మిత్రపక్షాలు కాడి పడేసే అవకాశం కూడా ఉంది. (అవసరం టీడీపీది కదా అనే భావనతో)

175 స్థానాల్లోనూ వైసీపీని సమర్థంగా ఢీ కొనాలంటే, కనీసం నాలుగు వేల కోట్ల రూపాయలు అవసరమని ఎన్నికల పండితులు లెక్కలు వేస్తున్నారు.

ఈ దశ దాటేసరికి, చంద్రబాబు వంట్లో చాలా కేలరీలు ఖర్చయిపోతాయి.

ఆయన అధిగమించవలసిన అసలైన సమస్యలు కనీసం ఇంకో రెండు ఉన్నాయి.

పొత్తులో భాగంగా టీడీపీకి లభించే వాటా స్థానాల్లో కనీసం 40శాతం స్థానాల్లో యువతకు కేటాయించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని ఆయన గతంలో పదే పదే ప్రకటించి ఉన్నారు. అంటే, తక్కువలో తక్కువ 50 స్థానాలు యువతకు కేటాయించవలసి ఉంటుంది. ఆ హామీపై  వెనక్కి వెళ్లడం ఆయనకు ఇబ్బందికరం కావచ్చు. అయితే, ఏ స్థానాలు యువతకు కేటాయించాలి అనేది తేల్చుకోవడం కూడా కష్టమైన కసరత్తే! ఆయా నియోజకవర్గాల్లో పాతుకుపోయిన పాత తరం వారిని సముదాయించుకు రావాలి. వారి వైపు నుంచి తిరుగుబాట్ల సమస్య ఒకటి ఎదురవుతుంది.

ఇది గాక, 2019లో గెలిచిన 23 మందికీ తిరిగి ఖాయమని చంద్రబాబు చెప్పినట్టు వార్తలు వచ్చాయి. అయితే, జనసేనకు గట్టిగా ఆసక్తి ఉన్న స్థానాలు గనుక ఆ ఇరవై మూడులో ఉంటే!?

ఇవన్నీ ముందుగా పరిష్కారం అయిన తరువాతే గెలవడం, గెలవకపోవడం అనే అంశం పరిశీలనలోకి వస్తుంది.

అనేక సమీకరణాల మీద ఆ అంశం ఆధారపడి ఉంది. ఎన్నికల ప్రకటన వెలువడే నాటికి ఈ విషయంలో ఓ స్పష్టత రావచ్చు. అప్పటి వరకూ ఎవరి ఓపిక కొద్దీ వారు ఊహాగానాలు చేసుకోవచ్చు.

ఎన్నికలు ఎప్పుడు జరిగినా... అధికారంలోకి వచ్చేది తెలుగుదేశమే అని చంద్రబాబునాయుడు తన పర్యటల్లో చెబుతున్నారు. తప్పులేదు. ఈ ఊహాగానం వల్ల టీడీపీ టికెట్‌లకు ఆశావహుల్లో పోటీ బాగా పెరిగిపోతుంది.

దీనికితోడు, ఈ నమ్మకం వల్ల ‘పబ్లిక్ పెర్సెప్షన్’ ఒకటి టీడీపీకి అనుకూలంగా మారవచ్చని కూడా పరిశీలకులు అంటున్నారు. పైపెచ్చు తటస్థులను కూడా చంద్రబాబు నమ్మకం గట్టిగానే ప్రభావితం చేస్తుందని కొందరు పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. టీడీపీకి ఈ ప్రచారం ఒక పాజిటివ్ డెవలప్‌మెంటు.

పవన్ కళ్యాణ్‌ను కూడా కలుపుకుంటే.... ‘కొట్టేస్తారు’ అంటూ జనంలో చాలామంది టీడీపీ గురించి మాట్లాడుతూ ఉంటారు.

అయితే, ఈ ‘ప్రజాభిప్రాయాన్ని’ జగన్ గానీ, వైసీపీ ముఖ్య నేతలు గానీ పరిగణనలోకి తీసుకున్నట్టు కనపడరు.

జగన్ ‘ఎలక్షన్ మేనేజ్‌మెంట్’ ప్రత్యేకమైనది, విలక్షణమైనది కావడం ఇందుకు ఒక కారణం అయితే కావచ్చు.

అందుకే, ఎంతమంది ఏకమై వచ్చినా... ‘జగన్ సింగిల్‌గా వస్తారు. మళ్ళీ వైసీపీయే అధికారంలోకి వస్తుంద’ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, మరి కొందరు అంటున్నారు. తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒంటిచేత్తో నడిపించి, వైసీపీ అభ్యర్థిని గెలిపించిన అనుభవంతో మాట్లాడుతున్నారు.  అందుకే, వైసీపీ క్యాంపులో ధీమా కనబడుతోంది. చూడాలి మరి, ఇన్ని కోణాల నుంచి ఎదురయ్యే సవాళ్ళను చంద్రబాబు ఎలా ఎదుర్కొంటారో!

**– భోగాది వేంకట రాయుడు**

# పంటలకు దిగుల్లేకుండా నీళ్ళు

## సాగునీటి బోర్డు సమావేశంలో నిర్ణయం

జిల్లాలో సాగునీటికి ఎలాంటి కొరత లేదని, పుష్కలంగా నీళ్లున్నాయి కనుక పంటలకు దిగుల్లేకుండా నీరందించాలని ఈనెల 23న జరిగిన సాగునీటి సలహా బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ప్రతి ఎకరాకు సాగునీటిని అందజేయాలన్నారు. నెల్లూరులోని జడ్పీ హాల్‌లో, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి కాకాణి మాట్లాడుతూ, 2022 –23 సంవత్సరానికి సోమశిల, కండలేరు ప్రాజెక్టుల పరిధిలో 8.46 లక్షల ఎకరాలకు మొదటిపంటకు సాగునీరందించేందుకు 84.6 టిఎంసిల నీటిని కేటాయిస్తున్నట్లు తీర్మానించామని చెప్పారు. జిల్లాలో ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సంగం బ్యారేజి, నెల్లూరు బ్యారేజి  నిర్మాణాలను పూర్తి చేసి  జిల్లా రైతాంగానికి అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా జిల్లా  రైతుల తరఫున ధన్యవాదాలు  తెలుపుతున్నామన్నారు. జిల్లాలో ప్రతిపాదించిన సాగునీటి కాలువల మరమ్మతులు, ఆధునీకరణ పనులు త్వరగా జరిగేలా చూడాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.

### అవినీతిపరులను వదిలేది లేదు

పౌర సరఫరాల శాఖలో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతోందని, అవినీతికి పాల్పడిన వారిని వదిలిపెట్టడం జరగదని ఈ సందర్భంగా మంత్రి కాకాణి స్పష్టం చేశారు.

గ్రామ స్థాయిలో  నీటి సంఘాల సభ్యులను, నీటిపారుదల శాఖ అధికారులను సమన్వయం చేసి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అదే విధంగా పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ కెనాల్స్ ఆధునీకరణ పనులపై ప్రత్యేకదృష్టి సారించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు.

ఈ సమావేశంలో కందుకూరు, ఉదయగిరి, కావలి శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, విఠపు బాలసుబ్రమణ్యం, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, జేసీ కూర్మనాథ్, డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, తెలుగు గంగ ప్రాజెక్ట్ సి.ఇ కె.హరినారాయణరెడ్డి, నీటి పారుదల ఎస్.ఇ పి.కృష్ణమోహన్, రైతు సంఘాల ప్రతినిధులు  గోవిందరెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 8వ వర్ధంతి



అందరి హృదయాలలో సుస్థిర స్థానమేర్పరుచుకుని,
నిండు నూరేళ్ళు పరిపూర్ణ జీవితాన్ని సాగించిన ప్రేమానురాగాల దీప్తి,
మా అభివృద్ధికి కారకురాలు, దైవసమానులు

## కీ॥శే॥ శ్రీమతి గునుపాటి రుక్మిణమ్మ గారు

పరమపదించి తేది 30-10-2022 నాటికి
ఎనిమిదేళ్ళు పూర్తికానున్న సందర్భంగా వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని
ఆ భగంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము

**కుమారులు - కోడళ్ళు**
గునుపాటి వెంకటకృష్ణారెడ్డి - ఇందిరమ్మ
గునుపాటి జనార్ధన్‌రెడ్డి - సునీతమ్మ
గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి - శుభప్రదమ్మ

**కుమార్తెలు - అల్లుళ్ళు**
కోటిరెడ్డి నిర్మలమ్మ - కీ॥శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి
అత్తివరపు విమలమ్మ - అత్తివరపు రామచంద్రారెడ్డి
కీ॥శే॥ దొడ్ల లలితమ్మ - దొడ్ల పద్మనాభరెడ్డి

మరియు
**మనుమలు, మనుమరాళ్ళు, ముదిమనుమలు, ముదిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com